కృషి పట్టుదల ఉంటే విజయం మన వెంటే



రాయచోటిలో అభిమానులకు అభివాదం చేస్తున్న సినీ హీరో కిరణ్ అబ్బవరం

- ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు
- హీరో కిరణ్ అబ్బవరం

సంబేపల్లె/రాయచోటిటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది లేదని నిరూపించారు హీరో అబ్బవరం కిరణ్. వరుసగా సినిమాలు తీస్తూ అందరినీ ఆశ్చర్యపరిచేలా ఉత్తమ కథా చిత్రాలను అందిస్తూ తనదైన శైలిలో ఓ సాధారణ కుటుంబం నుంచి వచ్చి తనకుంటూ సినిమా రంగంలో ఓ గొప్ప పేరు సంపాదించుకున్న అబ్బవరం కిరణ్‌ది రాయచోటి నియోజకవర్గం సంబేపల్లె మండలం దుద్యాల గ్రామం, పెద్దకోడివాండ్లపల్లె. తల్లిదండ్రులు బయారెడ్డి, పుష్పావతమ్మ. చిన్నప్పటి నుంచి సినిమాల పట్ల ఆసక్తి, హీరోగా చేయాలని తన కోరిక ఆయనను సినిమా రంగం వైపు అడుగులు వేసేలా చేసింది. అంతే రాజావారు రాణీవారు, ఎస్ఆర్ కల్యాణ మండపం, సమ్మతమే, వినరో భాగ్యమో విష్ణుకథ, మీటర్, నేను మీ అందరికీ బాగా కావాల్సిన వాడిని, ప్రస్తుతం క చిత్రాల్లో నటించారు. తనకంటూ ఓ గొప్ప స్థానాన్ని సంపాదించుకుని పలువురికి ఆదర్శంగా నిలిచారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

పాలబండ వీరాంజనేయస్వామి ఆలయంలో క సినిమా హీరో కిరణ్ అబ్బవరం మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. క సినిమా బ్లాక్ బస్టర్ కావడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి 101 టెంకాయలు కొట్టారు. దుద్యాల గ్రామం పెద్దకోడివాండ్లపల్లెకు చెందిన కిరణ్ అబ్బవరం తల్లిదండ్రులు బయారెడ్డి, పుష్పావతమ్మ స్థానికులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్నారు. కుమారుడు తీసిన సినిమా హిట్ కావడం సంతోషంగా ఉదన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాలతో మరింత పేరు రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాయచోటి పట్టణానికి చెందిన జ్యువెలర్ వ్యాపారి సుగవాసి జానకీరామ్, ఈశ్వర్, శ్రీనివాసులు, రెడ్డిశేఖర్‌రెడ్డి, వరగంరెడ్డి ప్రతాప్‌రెడ్డి, పలువురు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేశారు.

రాయచోటిలో సందడి

రాయచోటి పట్టణంలో మంళవారం క సినిమా విజయోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. ఈ విజయోత్సవ సభకు హాజరైన హీరో కిరణ్ అబ్బవరంకు జ్ఞానేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో అభిమానులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా హీరో మాట్లాడుతూ మా ఊరి అబ్బాయి అని మీరు గర్వంగా చెప్పుకునేలా సినిమాల్లో నటిస్తానన్నారు. "క" సినిమా మంచి విశేష ఆదరణ పొందుతోందని, సినిమా మంచి కుటుంబ కథా చిత్రం అన్నారు. ప్రేక్షకులు తన పట్ల చూపిస్తున్న ఆదరణ, ప్రేమ ఎప్పటికీ మరువనన్నారు. తాను కొత్త సినిమా రాస్తున్నానని వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని రాయచోటిలోనే షూటింగ్ ప్రారంభిస్తానని తెలిపారు. రాయచోటి ప్రాంతంపై తనకు విపరీతమైన ప్రేమ, అభిమానం ఉందన్నారు. ఇంతటి ఘన స్వాగతం పలికిన రాయచోటికి చెందిన అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇళ్లల్లో 'దీపం' వెలుగులు

- మాటిచ్చారు.. నిలబెట్టుకున్నారు...
- ఉచిత సిలిండర్లపై మహిళల సంతోషం
- లబ్ధిదారుల అకౌంట్లలోకి నగదు జమ

దీపావళి సందర్భంగా ప్రభుత్వం నుంచి వచ్చిన నూతన పథకం దీపం-2తో ఇళ్లల్లో వెలుగులు వచ్చాయి. ఈ పథకం కింద మహిళలకు ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లను ప్రభుత్వం ఇవ్వనుంది. ఇప్పటికే గ్యాస్ బుక్ చేసుకుని డెలివరీ అయిన వారి ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయి. దీంతో మహిళల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): కట్టెల పొయ్యి మీద వంట చేసే మహిళలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు ఏంటో తెలిసిన చంద్రబాబునాయుడు.. 1999-2000 లోనే.. దీపం పథకం ద్వారా మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారు. తర్వాత కాలంలో గ్యాస్ సిలిండర్ ధరలు ఆకాశానికి అంటాయి. సిలిండర్ రూ.1000 వరకు పెట్టాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో గ్యాస్ బండ పేద మహిళల పాలిట గుదిబండగా మారిందన్న విషయాన్ని గుర్తించిన చంద్రబాబు ఎన్నికలకు ముందు.. పేద మహిళలకు ఉచితంగా ఏడాదికి మూడు సిలిండర్లను ఇస్తామని సూపర్‌సిక్స్ పథకాల మ్యానిఫెస్టోలో చేర్చారు. ఆ ఎన్నికల్లో గతంలో ఎప్పుడూ లేనంతగా ప్రజలు కూటమికి బ్రహ్మరథం పట్టారు. పూర్తి స్థాయి మెజార్టీతో కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. సూపర్ సిక్స్ పథకాల అమలుకు శ్రీకారం చుట్టింది. అందులో మొదటగా మహిళలకు ఎంతో ఉపయోగపడే ప్రతిష్ఠాత్మక దీపం-2 పథకం అమలుకు నడుం బిగించింది. దీపావళి కానుకగా ఈ పథకం అమలులోకి వచ్చింది. దీనివల్ల అర్హులైన పేద మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించనుంది. జిల్లాలో 3,74,252 మంది లబ్ధిదారులకు ఈ పథకం వర్తిస్తుంది. ఇందుకు గానూ రాష్ట్ర ప్రభుత్వం రూ.32 కోట్లు లబ్ధిదారుల కోసం ఖర్చు చేయనుంది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు సిలిండర్ డెలివరీ సమయంలో డబ్బు చెల్లించాలి. సిలిండర్ తీసుకున్న 48 గంటల్లోగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ అవుతోంది. దీనిపైన మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పేద మహిళలకు ఈ ఉచిత మూడు సిలిండర్లతోనే ఏడాది గడిచిపోతుందని, డబ్బు పెట్టి గ్యాస్ కొనాల్సిన పని ఉండదని సంబరపడుతున్నారు.

దీపం పథకం మహిళలకు వరం



- యర్రపల్లె లక్ష్మిదేవి, మదనపల్లె

కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత సిలిండర్ల పథకం మహిళలకు వరం లాంటిది. సంవత్సరానికి మూడు సిలిండర్లు ఇవ్వడం అనేది మహిళలకు గుర్తింపు ఇచ్చినట్లే. ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు హామీ ఇచ్చిన ప్రకారం మాట నిలబెట్టుకున్నారు. మహిళల మనసు గెలుచుకున్నారు. గత ప్రభుత్వం అయిదేళ్లలో ఎన్నో కోట్ల రూపాయలు అప్పులు చేసినా..చంద్రబాబునాయుడు మాత్రం ఇచ్చిన మాట ప్రకారం దీపం పథకంలో కనెక్షన్ ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా సిలిండర్ ఇస్తున్నారు. అది కూడా దీపావళి రోజున ఇవ్వడం శుభపరిమాణంగా భావిస్తున్నాం. ఇక ఇళ్లలో మహిళలకు గ్యాస్ కష్టాలు తీరినట్లే.

మహిళలకు కూటమి ప్రభుత్వం ఆసరా



- పులకుంట్ల వాణి, మదనపల్లె

మహిళలకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టినా..ఉచిత సిలిండర్ల పథకం చాలా గొప్పది. ఏడాది మూడు సిలిండర్లు అంటే రూ.3 వేలు మిగిలినట్లే. గతంలో ఇదే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గృహిణిలు ఇంట్లో వంట చేయడానికి పడే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని దీపం పథకం ప్రవేశపెట్టారు. ఇప్పుడు కొత్తగా అదే పథకాన్ని గుర్తుచేస్తూ, ఉచిత సిలిండర్లు ఇస్తుండటం చూస్తే మహిళలు చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నాం. దీపావళి దీపం పథకం మహిళల కుటుంబాల్లో వెలుగులు నింపినట్లు అయింది.

గ్యాస్ డబ్బు ఖాతాలో పడ్డాయి



- జ్యోతి, సంబేపల్లె

దీపం-2 పథకం కింది కూటమి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న గ్యాస్ డబ్బులు ఖాతాలో జమయ్యాయి. నాకు ఖాతాకు రూ.809 జమ అయింది. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం సంతోషంగా ఉంది. ఏడాదికి మూడు సిలిండర్లు అందించడం గొప్ప విషయమే. సామాన్య కుటుంబానికి ఏడాదికి మూడు సిలిండర్లు కంటే.. ఎక్కువ ఖర్చు కాదు.. ఉచిత సిలిండర్లతోనే ఏడాదంతా గడిచిపోతుంది.

పేద వర్గాలకు దీపం పథకం ఓ వరం



- సుకన్య, విద్యుత్ నగర్, రాజంపేట

మాలాంటి పేద వర్గాలకు దీపం పథకం ఓ వరంలాంటిది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఏడాదికి మాలాంటి కుటుంబాలకు మూడు ఉచిత సిలిండర్లు ఇవ్వడం మాకు చాలా సంతోషంగా ఉంది. ఇది మా కుటుంబాలకు ఎంతో ప్రయోజనాన్ని చేకూరుస్తుంది.

చంద్రబాబు రుణాన్ని మర్చిపోలేం



- సీబాఎస్తర్, సాయినగర్, రాజంపేట

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో ఉన్నతాశయంతో మాలాంటి పేద కుటుంబాలకు ఏడాదికి మూడు సిలిండర్లను ఇవ్వడం ఆయన రుణాన్ని ఎప్పుడూ మర్చిపోలేము. ఈ విధంగా మూడు సిలిండర్లను ఇవ్వడం వల్ల పేద కుటుంబాలు ఎంతో సంతోషంగా మూడు పూటలా రుచికరమైన భోజనాన్ని చేసుకుని ఆనందంగా ఉండడానికి వీలు ఉంటుంది. అందుకు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

సైన్స్ ఎక్స్‌పోతో చిన్నారుల్లో విజ్ఞానం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



సైన్స్ ఎక్స్‌పో ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టరు చామకూరి శ్రీధర్

తంబళ్లపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ చిన్నారులలో విజ్ఞానం, అభ్యాసన నైపుణ్యం పెంపొందించేందుకు ప్రీ స్కూల్ సైన్స్ ఎక్స్‌పో ప్రదర్శనలు దోహదపడతాయని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. మంగళవారం తంబళ్లపల్లె ఐసీడీఎస్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రీ స్కూల్ సైన్స్ ఎక్స్‌పోకు కలెక్టరు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన హ్యాండ్ వాషింగ్, నా కుటుంబం, శరీరభాగాలు, పరిసరాలు, కార్యాలయాలు, హెల్పింగ్ పీపుల్, ఆకారాలు, రంగులు, జంతువులు, పండ్లు, పువ్వులు, జర్మినేషన్ ప్రాసెస్ తదితర 30 అంశాలను కలెక్టర్ తిలకించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వస్తువులు, వాటి రంగులు, వాటి ఉపయోగం తదితరాలలో పిల్లల నైపుణ్యాలను పరిశీలించారు. పిల్లలు చాలా ఉత్సాహంగా వారు ప్రదర్శించిన అంశాల గురించి కలెక్టర్‌కు వివరించారు. ప్రతి అంశంలో పిల్లలు చూపిన ప్రతిభ, వారిలోని నైపుణ్య అభ్యాసం, నేర్చుకోవడంలో వారికున్న ఆసక్తిపై కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల చేత తరగతి గదులలో బోర్డులపై రాయించడం, చదివించడం ఒక మంచి అభ్యసనం అవుతుందన్నారు. టీచరు ఒక వస్తువు గురించి చెప్పడంతో పాటు దాని రూపాన్ని బోర్డుపై రాస్తే అది పిల్లలు గుర్తు పెట్టుకుంటారన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్లాస్టిక్ బోర్డులు ఉన్నాయని అయితే చిన్నారుల్లో జిజ్ఞాసను, అభ్యసన నైపుణ్యాలను పెంచేందుకు ప్రయోగాత్మకంగా తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టులోని అంగన్వాడీ కేంద్రాలకు గ్రీన్ బోర్డులు, డస్టరు, చాక్‌పీస్ బాక్సులను అందజేశారు. ఇవి ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటే జిల్లా అంతటా గ్రీన్ బోర్డులు ఇస్తామని తెలిపారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టును అభినందించిన కలెక్టరు

తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో ప్రదర్శనలను నిర్వహించిన సీడీపీవోను, టీచర్లను, ఆయాలను మొత్తం బృందాన్ని కలెక్టరు అభినందించారు. అంగన్వాడీ టీచర్లు పిల్లల వృద్ధి కోసం కష్టపడి పనిచేయాలని సూచించారు. హాజరు శాతం వాస్తవానికి దగ్గరగా ఉండాలని, ప్రతి అంగన్వాడీ కేంద్రంలో వంద శాతం హాజరు ఉండేలా కృషి చేయాలన్నారు. జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులన్నీ తంబళ్లపల్లె ప్రాజెక్టును ఆదర్శంగా తీసుకుని మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని కలెక్టరు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ రమాదేవి, సీడీపీవో నాగవేణి, తహసీల్దారు హరికుమార్, ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, టీడీపీ మహిళా నేత సిద్దమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

- హాజరు కానున్న 13 ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు
- రూ.3 లక్షలు నగదు బహుమతి ప్రకటించిన జయచంద్రారెడ్డి

ములకలచెరువు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువులో బుధవారం నుంచి 68వ రాష్ట్ర స్థాయి అండర్-14 విభాగం బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరగనున్నాయి. బుధ, గురువారాలు జరిగే ఈ పోటీల్లో బాలురు, బాలికల విభాగంలో రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు హాజరు కానున్నారు. ఈ పోటీలకు ములకలచెరువులోని ఇండెన్ గ్యాస్ గోడౌన్ సమీపంలో ఉన్న మైదానాన్ని సిద్ధం చేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి ఇప్పటికే బాలురు, బాలికల విభాగంలో మొదటి, రెండవ స్థానంలో నిలిచిన జిల్లా జట్లకు రూ.3 లక్షలు నగదు ప్రోత్సాహకం ఇస్తామని ప్రకటించారు. అలాగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, పీడీలు, పీఈటీల అభ్యర్థన మేరకు పోటీల్లో పాల్గొనే ఉమ్మడి 13 జిల్లా క్రీడాకారులకు, సిబ్బందికి భోజన, వసతి, మెమెంటోలు, స్టేజి ఏర్పాటు తదితర ఖర్చులను భరిస్తున్నారు. అలాగే మైదానాన్ని కూడా చదును చేయించారు.



పోటీలకు మైదానాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

9న సీఎం చంద్రబాబు రాక

కడప, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఈనెల 9వ తేదీ శనివారం గండికోట పర్యటనకు రానున్నారు. ఈ మేరకు అధికారికంగా పర్యటన ఖరారైంది. అయితే పర్యటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా రాలేదు. 9న వస్తున్నట్లు సమాచారం అందిందని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ డీఆర్‌సీ సమీక్ష సమావేశంలో వెల్లడించారు.

బొప్పాయి మొక్కలకు భలే గిరాకీ

- 30 నర్సరీల్లో బొప్పాయి మొక్కల పెంపకం
- నాలుగు రాష్ట్రాలకు 30 లక్షలకు పైగా మొక్కలు సరఫరా
- 2 వేల మంది కూలీలకు ఉపాధి

4



బడిపంతుల గడ్డ.. పిట్టిగుంట


- ఓ కుగ్రామంలో 38 మంది ఉపాధ్యాయులు
- సంపూర్ణ అక్షరాస్యత
- ఆదర్శ గ్రామంగా గుర్తింపు

4

బడిపంతుల గడ్డ.. పిట్టిగుంట

మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అంటారు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల తర్వాత స్థానం ఉపాధ్యాయుడిది. అలాంటి గురువులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది ఆ గ్రామం. కేవలం 75 కుటుంబాలున్న ఆ గ్రామంలో ఎక్కువమంది ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు. ఓ ఇంజనీరు తప్పుచేస్తే తాను నిర్మించిన బ్రిడ్జి మాత్రమే కూలిపోతుంది. ఉపాధ్యాయుడు తప్పుచేస్తే సమాజమే పెడదారి పడుతుందంటారు పెద్దలు. అలాంటి బాధ్యతాయుతమైన ఉపాధ్యాయ కొలువులతో గ్రామానికే వన్నె తెస్తున్నారు.

● ఓ కుగ్రామంలో 38 మంది ఉపాధ్యాయులు ● సంపూర్ణ అక్షరాస్యత ● ఆదర్శ గ్రామంగా గుర్తింపు



కాశినాయన, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాశినాయన మండలంలోని పిట్టిగుంట గ్రామంలో దాదాపు 75 కుటుంబాలున్నాయి. దాదాపు ఓకే సామాజికవర్గం. వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఉన్న ఓ కుగ్రామం అది. సువిశాలమైన వ్యవసాయ భూములులేవు.. మంచి గుర్తింపు ఉన్న నాయకులు లేరు.. సంపన్నులూ అక్కడ లేరు. ఒక సాధారణమైన దిగువ మధ్యతరగతి వారు నివసించే పల్లెటూరు. రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేదలు అధికంగా ఉండేవారు. 1955 సంవత్సరం నాటికి ఆ గ్రామంలో నిరక్షరాస్యత పేదరికం జంటగా ఉండేవి. కేవలం వేళ్లమీద లెక్కించే సంఖ్యలో మాత్రమే గ్రామంలో అక్షరజ్ఞానం కలిగిన వారు ఉండేవారు.

గ్రామంలో తిండికి సంపాదించకోవడమే అతి కష్టంగా ఉండే రోజులవి. అలాంటి రోజుల్లో గ్రామం నుంచి కలసపాడు, పోరుమామిళ్లకు దాదాపు రోజుకు 20 కి.మీ దూరం నడిచిపోయి వస్తూ కొంతమంది యువకులు చదువుకున్నారు. బతకలేక బడిపంతులు అనే నానుడి ఉన్న ఆ రోజుల్లోనే పలువురు యువకులు ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీ, హైయ్యర్ గ్రేడ్ లాంటి చదువులు చదివి అవసరమైన ట్రైనింగ్‌లు పూర్తిచేసి ఉపాధ్యాయ వృత్తిలోకి దిగారు. గ్రామానికి చెందిన కీర్తిశేషులు బుసిరెడ్డి జానకిరామిరెడ్డి మొట్టమొదటగా 1962 సంవత్సరంలో నెలకు రూ.92 వేతనంతో బడిపంతుల కొలువు సంపాదించాడు.

దీంతో ఇతర పిల్లల తల్లిదండ్రుల్లో కూడా తమ బిడ్డలను అయ్యవార్లను చేయాలనే ఆలోచన రేకెత్తించింది. అనుకున్నదే తడవుగా అనతి కాలంలోనే బి.పుల్లారెడ్డి, బోయిళ్ల నర్శిరెడ్డి, బి.చెంచిరెడ్డి, పి.బాలవెంకటరెడ్డి, పివెంకటసుబ్బారెడ్డితో పాటు పదుల సంఖ్యలో ఉపాధ్యాయ కొలువులు పొందారు. దీంతో గ్రామంలో చదువుకునే యువత దృష్టి ఉపాధ్యాయ వృత్తిపై పడింది. ఒకరిని చూసి మరొకరు అన్నట్లుగా ఆ దిశగా అడుగులు వేస్తూ ఒక్కొక్కరుగా ఉపాధ్యాయ వృత్తిని సంపాదించుకుంటూ వచ్చారు. వారి సంఖ్య ప్రస్తుతం 38కి చేరింది. వీరిలో 8 మంది రిటైర్ కాగా ఐదారుగురు ప్రభుత్వ కొలువు లభించనప్పటికీ మంచి గుర్తింపు ఉన్న ప్రైవేట్ కాలేజీలైన బీఈడీ, బీటెక్, జూనియర్ కాలేజీల్లో ప్రిన్సిపల్స్‌గా, లెక్చరర్స్‌గా పనిచేస్తున్నారు.



పిట్టిగుంట గ్రామం వ్యూ

ఉపాధ్యాయులు కావాలన్నదే లక్ష్యంగా..

చిన్నగ్రామంలో ఐదారు కుటుంబాల్లో భార్య భర్త ఇద్దరూ టీచర్లుగా ఉండటం విశేషం. మునుపటి తరంవారే కాకుండా తర్వాత తరంవారు కూడా బోధనపైనే మక్కువ పెంచుకున్నారు. స్వరాష్ట్రంలో సీట్లు లభించకపోతే కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు పోయి టీటీసీ, బీఈడీ, ఎంఈడీ లాంటి ఉన్నత చదువులు చదివి బోధనలోనే స్థిరపడ్డారు. అప్పట్లో 90 శాతంమంది యువకులు ఉపాధ్యాయ కొలువు పొందాలన్నదే లక్ష్యంగా చదువులు చదివారు. దీంతో ప్రతి కుటుంబంలో ఒకరిద్దరు డిగ్రీలు, పీజీలు, టీటీసీ, బీఈడీ చేశారంటే నాటి యువతలో భోధనపై ఎంత మక్కువ ఉండేదో ఇట్లే అర్థమవుతుంది.

ఆదర్శ గ్రామం కావడంతో..

సంపూర్ణ అక్షరాస్యత ఉండటంతో చాలాకాలం క్రితమే పిట్టిగుంటను ప్రభుత్వం ఆదర్శగ్రామంగా గుర్తించింది. దీంతో మండలంలో ప్రభుత్వ పరంగా ఏ కార్యక్రమం ప్రారంభించాలన్నా పిట్టిగుంట గ్రామాన్నే అధికారులు పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేస్తారు. ఇటీవల గ్రామంలోని యువత ట్రెండ్ మారింది. ఇప్పుడు ఉపాధ్యాయ వృత్తేకాకుండా ఇతర వృత్తుల్లోకి వెళ్లేలా యువతీ యువకులు చదువుతున్నారు. ఇక్కడి యువత ప్రభుత్వ ప్రైవేట్ రంగాల్లో ఏదోఒక జీవనోపాధి పొందుతూ చుట్టుపక్కల గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది. దీనంతటికి వెనకటి తరం అయవ్వార్లదే పునాది అని నేటికీ గ్రామస్తులు, చుట్టుపక్కల మండలాల్లోని ప్రజలు గుర్తు చేస్తుంటారు.

రూ.92 జీతానికి చేరాను



పేదరికం, నిరక్షరాస్యత కవల పిల్లల్లా సంచారం చేస్తున్న రోజులవి. చదువుకోవాలని ఉన్నా చదివించలేని పేద కుటుంబాలు ఎక్కువగా ఉన్న గ్రామం మాది. బడికి వచ్చినా ప్రాథమిక దశలోనే బడి మానేసి వ్యవసాయ పనులకు వెళ్లేవారు. అలాంటి పరిస్థితుల్లో నేను మెట్రిక్యులేషన్ వరకు చదివి అనంతరం శ్రీకాళహస్తిలో ట్రైనింగ్ పూర్తిచేశాను. 1962 సంవత్సరంలో రూ.92ల జీతానికి టీచర్‌గా చేరాను.

- బి.పుల్లారెడ్డి,
విశ్రాంత ఉపాధ్యాయుడు, పిట్టిగుంట

ఉపాధ్యాయ వృత్తిపై మక్కువ




నేను మొదట ఆర్మీలో చేరాను. కొన్నిసంవత్సరాలు దేశరక్షణలో పాలుపంచుకున్నాను. నేను బయటికి వచ్చేనాటికి గ్రామంలో ఎక్కువ మంది ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. మరికొందరు ఉపాధ్యాయ ఉద్యోగం కోసం కసరత్తు చేస్తున్నారు. నాకు ఆ వృత్తిపై మక్కువ కల్గింది. నేనూ బీఈడీ చేశాను. అనంతరం నిర్వహించిన డీఎస్సీలో సైన్సు ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యి పనిచేస్తున్నాను

- బోయిళ్ల విద్యార్థన్‌రెడ్డి,
సైన్సు ఉపాధ్యాయుడు, పిట్టిగుంట

జీతం తక్కువ.. గౌరవం ఎక్కువ...

నేను రూ.150 జీతానికి ఉద్యోగంలో చేరాను. ఆ రోజుల్లో జీతం తక్కువైనా గౌరవం ఎక్కువగా లభించేది. గ్రామంలో దిగీదిగగానే బస్టాప్ నుంచి ఐదారు మంది ఉపాధ్యాయుడిని అనుసరిస్తూ ఆప్యాయంగా మాట్లాడుతూ బడి వరకు వచ్చేవారు. దీనికి తోడు పాత రోజుల్లో ఉపాధ్యాయులు కొంతైనా నైతిక విలువలు పాటిస్తూ వచ్చేవారు. మా గ్రామంలోని యువత కూడా మాలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు.

- చలపతిరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు, పిట్టిగుంట



ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

చిన్నమండెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టరు ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పడమటికోన పంచాయతీ నడిగడ్డపల్లెకు చెందిన రామంజులమ్మ (57) ఆమె భర్త నాగరాజుతో కలసి మంగళవారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని పోస్టాఫీసు వద్దకు వచ్చింది. పని ముగిసిన అనంతరం స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా చిన్నమండెం, పెద్దమండెం రహదారిలోని చాంద్‌బాషా మామిడితోట వద్ద ట్రాక్టర్ ఢీకొంది. దీంతో కిందపడిన ఆమె పైనుంచి ట్రాక్టర్ వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రీసర్వే అర్జీలను త్వరగా పరిష్కరించాలి

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రీసర్వే ప్రక్రియలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం వెలగపూడి సచివాయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు, సర్వేశాఖ అధికారులతో సీసీఎల్ఏ జయలక్ష్మి రీసర్వే ప్రక్రియపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి కలెక్టర్ శ్రీధర్ ఈ సమావేశానికి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఇప్పటివరకు జరిగిన గ్రామ సభల్లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, సర్వేశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌వో మధుసూదనరావు, ఏడీ సర్వే భరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు భవనాల్లోకి కోర్టు

● ఆమోదం తెలిపిన ప్రభుత్వం

కలికిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా కేంద్రంలో కొన్ని కోర్టుల నిర్వహణకు తీసుకున్న ప్రైవేటు భవనాలకు అద్దె చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కడప కేంద్రంగా ఉన్న కొన్ని కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిని మరమ్మతులు చేసేందుకు వీలుకాని స్థాయిలో ఉన్నాయి. చివరికి ప్రాణాలకు హాని కలిగించే విధంగా ఉన్నందువల్ల వివిధ కోర్టుల నిర్వహణకు ప్రైవేటు భవనాలను ఎంచుకున్నారు. స్థానికంగా ఉన్న ఆక్స్‌ఫర్డ్ జే స్కూల్ భవనాలు కోర్టుల నిర్వహణకు అనువుగా ఉన్నందున నెలకు రూ.1.20 లక్షలు అద్దెగా రాష్ట్ర హైకోర్టు నిర్ణయించింది. ఐదవ అదనపు జిల్లా కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులను ఈ ప్రైవేటు అద్దె భవనాల్లో నిర్వహించేందుకు హైకోర్టు అనుమతించింది. వీటితో పాటు కడప జిల్లాకు సంబంధించి రాయచోటిలో ఉన్న మధ్యవర్తిత్వ న్యాయ సేవా విభాగం (ఎంఎల్ఎస్ఏ) కార్యాలయాన్ని కూడా ఈ అద్దె భవనాల్లో ఏర్పాటు చేసేందుకు హైకోర్టు నిర్ణయించింది. హైకోర్టు నిర్ణయించిన అద్దెను నిర్ధారించేందుకు హైకోర్టు రిజిస్ట్రారు (రిక్రూట్‌మెంట్) ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. హైకోర్టు నిర్ణయించిన అద్దెతో ప్రైవేటు భవనాల్లో కోర్టులను నిర్వహించేందుకు హైకోర్టు తీసుకున్న నిర్ణయానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర న్యాయ, శాసన సభా వ్యవహారాల శాఖ కార్యదర్శి వి.సునీత మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

సర్వే సక్రమంగా నిర్వహించాలి : జేసీ



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

మదనపల్లె అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితుల సర్వే సక్రమంగా నిర్వహించి వారికి పారితోషికం సకాలంలో చెల్లించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులతో సమీక్షించిన ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని, రికార్డుల గదిని పరిశీలించారు. రైతుల నుంచి వినతులను స్వీకరించారు. తట్టివారిపల్లె వద్ద రైతులు అబ్జెక్షన్ తెలిపిన ఇళ్లను, భూములను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్ భూములను సక్రమంగా సర్వే నిర్వహిచాలన్నారు. మదనపల్లె పట్టణం పరిసర ప్రాంతాల్లో చెరువులు ఆక్రమణకు గురైనట్లు, ప్రభుత్వ భూఆక్రమణ చాలా వరకు చేసిన విషయం తన దృష్టికి వచ్చిందని వెంటనే సర్వే నిర్వహించి ఏడు రోజుల్లో ఆక్రమాలను తొలగించి హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆధార్ కార్డులోని వివరాలను, లేదా పాఠశాల వివరాలతో మార్పులు చేయాలని, కరెక్షన్ చేసి వెంటనే వారికి సర్టిఫికెట్లు మంజూరు చేయాలన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి సిబ్బందిని త్వరలోనే పంపుతామన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఖాజాబీ, డీటీ అస్లాం, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆక్రమణలు కూల్చివేత

● ప్రభుత్వ స్థలాలు అమ్మిన వారిపై చర్యలు : కలెక్టర్ చామకూరి శ్రీధర్



ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం

కురబలకోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు వద్ద ప్రభుత్వ స్థలంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను అధికారులు మంగళవారం కూల్చివేశారు. వివరాలిలా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతల పాపం....పేదల పాలిట శాపంగా మారింది. మండలంలోని అంగళ్లు పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 118లో రస్తా పోరంబోకు స్థలంలో 28 సెంట్ల స్థలాన్ని గత ప్రభుత్వ హయాంలో అధికార నేతలు కొంతమంది ఇష్టానుసారంగా ఆక్రమించుకుని అమ్మకాలు చేపట్టారు. ఈ స్థలానికి నకిలీ పట్టాలు సృష్టించి 12 మందికి రూ.3.50 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు అమ్మకాలు చేపట్టి సొమ్ము చేసుకున్నారు.

ఆ భూమికి పట్టాలు పొందామని ఇక ఆ స్థలం మాదేనని భావించి లక్షలాది రూపాయలు వెచ్చించి పలువురు నిర్మాణాలు చేపట్టారు. దీనిపై పలుమార్లు ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో నిత్యం ఆ మార్గంలో పలువురు జిల్లా, డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారులు రాకపోకలు సాగించినా అటువైపు కన్నెత్తి చూసే సాహసం చేయలేదు. అయితే కూటమి అధికారంలో రావడంతో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలానికి సంబంధించి పలువురు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో ఇటీవల తాజాగా ఆక్రమణకు గురైన భూమిలో ప్రభుత్వానికి చెందిన భూమిగా నిర్ధారిస్తూ రెవెన్యూ అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు. దీని విలువ ప్రైవేట్ మార్కెట్‌లో కోట్లలో పలుకుతుంది. కాగా మంగళవారం రెవెన్యూ అధికారులు ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణాలను యంత్రాల సాయంతో కూల్చేశారు. కాగా నేతల చేతిలో మోసపోయి అక్రమ నిర్మాణాలు చేపట్టిన బాధితులు లబోదిబోమంటున్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

కలెక్టర్ చామకూరి శ్రీధర్ మంగళవారం ఆక్రమణకు గురైన స్థలం వద్దకు చేరుకుని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే ఇంతవరకు ఎందుకు అడ్డుకోలేదని అధికారులను ప్రశ్నించారు. ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే అడ్డుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పించడంతో పాటు సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని హెచ్చరించారు.

ప్రభుత్వ స్థలాలను అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తపస్విని, ఆర్ఐ బాలసుబ్రమణ్యం, సర్వేయర్ భువనేశ్వరి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

బొప్పాయి మొక్కలకు భలే గిరాకీ

● 30 నర్సరీల్లో బొప్పాయి మొక్కల పెంపకం ● నాలుగు రాష్ట్రాలకు 30 లక్షలకు పైగా మొక్కలు సరఫరా ● 2 వేల మంది కూలీలకు ఉపాధి

రైల్వేకోడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రతిఏటా బొప్పాయి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ ఏడాది లక్ష ఎకరాల్లో కోటి మొక్కలను రైతులు నాటారు. రైల్వేకోడూరులోని 30 నర్సరీల్లో బొప్పాయి మొక్కల పెంపకాన్ని చేపట్టారు. మన రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాలకు ఇక్కడి నుంచి 30 లక్షల మొక్కలను నర్సరీ వ్యాపారులు ఎగుమతి చేశారు వివరాల్లోకి వెళితే...రైల్వేకోడూరు ప్రాంతం వాణిజ్య పంటలకు కేంద్ర బిందువు. ఇక్కడ మామిడి, అరటి తరువాత బొప్పాయి పంటను రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. బొప్పాయి కాయలు సీజన్ లో మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, ఢిల్లీ, కశ్మీర్, అహ్మదాబాద్, హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాలకు ఎగుమతి చేస్తారు. గత ఏడాది బొప్పాయి గింజలు నాసిరకంగా ఉండడంతో రైతులు నిలువునా మునిగిపోయారు. దిగుబడులు ఎక్కువగా రాలేదు. అయితే కాయలు టన్ను రూ.20 వేల వరకు ధరలు పలికాయి. ఈ ఏడాది నాణ్యత గల గింజలు తెచ్చి నర్సరీల్లో పెంపకం చేశామని వ్యాపారులు అంటున్నారు. గత ఏడాదిలో ఒక్క మొక్క రూ.13కు విక్రయాలు చేశారు.



రైల్వేకోడూరు నర్సరీలో పెరుగుతున్న బొప్పాయి మొక్కలు

ఈ ఏడాది ఒక్క మొక్క రూ.11కు విక్రయిస్తున్నారు. డిమాండు పెరిగే కొద్ది రూ.14 నుంచి రూ.15 వరకు మొక్కలను అమ్ముతారు. రైల్వేకోడూరు ప్రాంతంలో ప్రధానంగా రెడ్‌లేడి 786, తైవాన్ రకాన్ని రైతులు సాగు చేస్తున్నారు. ఎకరాకు సుమారు 1000 మొక్కలు నాటుతారు. ఎకరాకు పొలంలో బొప్పాయి సాగు చేపట్టాలంటే దుక్కులు, కూలీలు, మందులు, మొక్కలు తదితర వాటికి రూ.40 వేలు ఖర్చు అవుతుంది. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు సుమారుగా రూ.2 లక్షలు లాభం వస్తుందని రైతులు అంటున్నారు. అయితే బొప్పాయి వ్యాపారంలో దళారులు ఉన్నారు. దీంతో చాలా మేరకు రైతుకు నష్టం ఏర్పడుతోంది. మార్కెట్‌లో ధరలు లేవని దళారులు చెప్పి రైతులను నిలువునా మోసాలు చేస్తున్నారు. చాలా మంది రైతులు నేరుగా మార్కెట్‌కు కాయలు పంపిస్తున్నారు. బొప్పాయి సీజన్‌లో రైల్వేకోడూరు ప్రాంతంలో నెలలపాటు ఢిల్లీ, ముంబై తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు మకాం వేసి ఇక్కడ వ్యాపారం కొనసాగిస్తారు. బడా రైతులు వారితో సంబంధాలు పెట్టుకుని వారి కాయలను ఆ వ్యాపారులకు ఇస్తున్నారు. కాయలు కొనుగోలు చేసే ముందు ఒక రేటు కాయలు కోసిన తర్వాత మరో రేటు చెబుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రోజు 50 లారీలకు పైగా బొప్పాయి కాయలను ఇతర రాష్ట్రాలకు తరలిస్తుంటారు. 2 వేల మంది కూలీలు జీవనోపాధి పొందుతున్నారు. గుత్తి, గుంతకల్లు, అనంతపురం, కర్నూలు, తాడిపత్రి తదితర ప్రాంతాలకు చెందిన కూలీలు ఇక్కడ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అధికంగా లాభాలు వస్తున్నాయని రైతులు సాగును వదలడం లేదు. ఏదీఏమైనా బొప్పాయి కాయలకు డిమాండు తగ్గడం లేదు.

నాణ్యత గల మొక్కలను ఇస్తున్నాము



నాణ్యత గల మొక్కలను రైతులకు అందించాము. వైరస్ లేని మొక్కలు ఇచ్చాము. రైతులు లాభాలు తెచ్చుకోవాలంటే సేంద్రియ వ్యవసాయం చేయాలి. మొక్కలు నాటినప్పటి నుంచి జాగ్రత్తగా శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారుల సూచనలు, సలహాలు తీసుకుని రైతులు సాగు చేయాలి. బొప్పాయి సాగుకు వాతారవణం అనుకూలించాల్సి ఉంటుంది. బొప్పాయి నాటిన తర్వాత వర్షం కురవకూడదు. వైరస్ రాకుండా ఉండాలంటే నాటిన నాటి నుంచి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. లాభాలు వస్తాయని విచ్చలవిడిగా మందులు పిచికారీ చేస్తే ఇబ్బందులు వస్తాయి.

- ఎస్.రవికుమార్‌రాజు, నర్సరీ వ్యాపారి, కోడూరు

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం

గుర్రంకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భార్యను కాపురానికి పిలిపించాలని పోలీస్‌స్టేషన్‌కు వస్తే పట్టించుకోలేదంటూ ఓ యువకుడు గుర్రంకొండ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యకు యత్నించాడు. బాధితుడి వివరాల మేరకు... తరిగొండ పంచాయతీ ఇరగన్నగారిపల్లె వాసి నరసింహులు కుమారుడు మణికి తిరుపతి జిల్లా భాకరాపేట మండలం తలకోన పంచాయతీ అవులయ్యగారిపల్లెకు చెందిన రమణ కుమార్తె మానసతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పది రోజుల కిందట భార్యాభర్తలిద్దరూ గొడవపడ్డారు. దీంతో మానస పిల్లలను వదిలి అమ్మగారి ఇంటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో మణి తన భార్యను కాపురానికి పిలిపించాలంటూ వారం రోజులుగా గుర్రంకొండ పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నాడు. పోలీసులు తనదే తప్పంటూ నిందించడంతో మనస్థాపానికి గురైన యువకుడు బ్లేడుతో ఎడమ చేతిపై కోసుకుని కడప-బెంగళూరు జాతీయ రహదారిపై పడుకుని నిరసన వ్యక్తం చేశాడు. అక్కడే ఉన్న పోలీసులు బాధితుడికి సర్దిచెప్పి లోపలికి తీసుకెళ్లారు. అతడి భార్యను పిలిపించి న్యాయం చేస్తామని ఎస్ఐ మధురామచంద్రుడు బాధితునికి నచ్చచెప్పాడు.



చేతిపై బ్లేడుతో కోసుకున్న దృశ్యం

నత్తనడకన కంప్యూటరీకరణ

- స్తంభిస్తున్న కార్యకలాపాలు
- పీఏసీఎస్‌లో పంట రుణాలకు ఇక్కట్లు
- గతంలో వందల కోట్లు రుణం
- ఇప్పుడు రూ.50కోట్లు దాటని వైనం
- పైలెట్ ప్రాజెక్టు కింద నాలుగు సొసైటీలు



కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):
- ఇగో రామయ్యా.. గతంలో తీసుకున్న రుణానికి వడ్డీ కట్టాలే. చాణ రోజుల నుంచి పెండింగు చూపిస్తాంది, వెంటనే కట్టుకో లేదంటే ఇబ్బంది పడాల్సి వచ్చాది చూడు మల్ల ముందే చెబుతాండా.

! అదేందయ్యా నేనే పతిసారీ వడ్డీ కడతాండ. మీరు బుక్కల్లో రాసుకోకండా తినేసి మళ్లా నన్ను వడ్డీ కట్టలేదంటే యాన్ని ంచి తేవాలయ్యా సామీ, నేను కట్టలేను.

- ఇదో లచ్చుమయ్యా.. మీ నాయన సొసైటీ బాంకిలో అప్పుడు ఎప్పుడో లోను తీస్కున్నాడు. వడ్డీతో కలిపి బాకీ తీరిచ్చే.. భూమి ఉంటాది.. లేదంటే ఏలమేయాల్సి వచ్చాది.

! ఏందయ్యా మా భూమి కుదవ పెట్టి సొసైటీ బాంకిలో లోను తీసుకోని మల్లా గడువు ముందే కట్టినన్నాడు. మల్లా లోను తీసుకున్న ఇషయమే మా నాయన మాకు చెప్పలే, ఇప్పుడు ఉన్న ట్టుండి భూమి ఏలం వేచ్చామంటుండరు యాందీ ఇదంతా..

ఇప్పటి వరకు ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలలో రైతులు, సొసైటి బ్యాంకు అధికారుల మధ్య జరుగుతున్న తంతు. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సొసైటీలలో లావాదేవీలకు సంబంధించి కంప్యూటరీకరణకు శ్రీకారం చుట్టింది. అయితే ఇది నత్తనడకన సాగుతుండటంతో రైతులకు ఇబ్బందులు తప్పేలా లేవు. వివరాల్లోకి వెళితే..

గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు రుణాలు ఇచ్చేందుకు సహకారశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ (పీఏసీఎస్)లలో రికార్డుల నిర్వహణ చేతిరాతతో ఉండడంతో ఎంతో కొంత అవకతవకలకు ఆస్కారం ఉంటుంది. కొన్ని చోట్ల సిబ్బంది చేతివాటం ప్రదర్శించడం వల్ల రైతులు ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. మరికొన్ని చోట్ల డబ్బులు చెల్లించకుండా తాము కట్టాం, మీరు తినేసి మళ్లీ కట్టమంటున్నారంటూ బుకాయించేవారు ఉండే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితికి ఫుల్‌స్టాప్ పెట్టేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. పీఏసీఎస్‌లను కంప్యూటరీకరించాలని నిర్ణయం తీసుకుంది. మొదటగా కొన్ని సొసైటీలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసుకుని అవి పూర్తి కాగానే దశల వారీగా అన్ని సొసైటీలను కంప్యూటరీకరించాలని ప్రణాళిక రూపొందించారు. ఈ క్రమంలో మన జిల్లాలో మైదుకూరు ఎఫ్ఏసీఎస్, లక్కిరెడ్డిపల్లె, లింగాపురం, తిమ్మసముద్రం పీఏసీఎస్‌లను ఎంపిక చేశారు. వీటిలో పూర్తిస్థాయిలో కంప్యూటరీకరించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ గడువు పూర్తయినా లక్ష్యం నెరవేరలేదు.

సిబ్బందికి శిక్షణ ఇచ్చినా...

సొసైటీల కంప్యూటరీకరణ కోసం సొసైటీ సిబ్బందికి శిక్షణ కూడా ఇవ్వడం జరిగింది. కానీ వారిలో కొంతమందికి కంప్యూటరు పరిజ్ఞానం లేకపోవడంతో కంప్యూటరీకరణ నత్తనడకన సాగుతున్నట్లు తెలుస్తోంది. మొదట సెప్టెంబరు మాసాంతానికి పూర్తి చేయాలనుకున్నారు. కానీ వివిధ కారణాల వల్ల గడవు పొడిగించినట్లు తెలుస్తుంది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సొసైటీల కంప్యూటరీకరణ కోసం రూ.2500 కోట్లు నిధులు కేటాయించినట్లు సమాచారం. అయితే కంప్యూటరీకరణలో సాఫ్ట్‌వేర్ సంస్థలకు అప్పగిస్తే పనులు త్వరితగతిన పూర్తయ్యే అవకాశాలు లేకపోలేదు. కానీ రాష్ట్రస్థాయిలో సహకార శాఖ ఉన్నత అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సొసైటీల్లో కంప్యూటకీరణ పూర్తయితే రైతులకందించే రుణాలు, వడ్డీల్లో తేడాలు రాకుండా మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు వీలవుతుంది. అంతేకాకుండా రైతులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు కూడా సొసైటీల ద్వారా సాయమందించే ఆలోచనలో ప్రభుత్వం యోచిస్తోంది. ఈ తరుణంలో జిల్లా కలెక్టరు, జాయింట్ కలెక్టర్లపై కూడా రాష్ట్రప్రభుత్వం వత్తిడి తీసుకురానున్నట్లు సమాచారం.

పంట రుణాలకు ఇబ్బందులు

డీసీసీ బ్యాంకు పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల పరిధిలో సభ్యులైన రైతులకు కోట్లాది రూపాయలు పంట రుణాలు అందజేస్తారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు ప్రతి సంవత్సరం 350 నుంచి రూ.400 కోట్లు రుణాలు అందించేవారు. అయితే కంప్యూటరీకరణ పనుల వల్ల రుణాలు అందించడంలో కూడా కొంత జాప్యం జరిగే అవకాశం ఉందని చర్చ సాగుతోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.50 కోట్లు కూడా ఇచ్చే పరిస్థితులు ఉండవని అధికార యంత్రాంగం చెబుతుంది. రుణాల విషయం అటుంచితే, రికవరీలో కూడా ఆలస్యం అవుతున్నట్లు బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై జిల్లా సహకార శాఖాధికారి సుభాషిణిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. డీసీసీ బ్యాంకులోని ప్రత్యేక విభాగం కంప్యూటరీకరణను పరిశీలిస్తుందని, పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

పెన్నానదిలో బాలుడు గల్లంతు

- డ్రోన్ కెమెరాలతో పరిశీలన
- కొనసాగుతున్న గాలింపు



పెన్నానదిలో బాలుడి ఆచూకీ కోసం డ్రోన్ కెమెరాలతో పరిశీలిస్తున్న దృశ్యం

కడప క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప నగరానికి చెందిన మణికంఠ అనే బాలుడు ఆదివారం స్నేహితులతో కలిసి చెన్నూరు సమీపంలోని పెన్నానదిలో ఈతకు వెళ్లాడు. నలుగురు స్నేహితులు తిరిగి రాగా మణికంఠ పెన్నానదిలో గల్లంతైనట్లు తెలిసింది. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న చిన్నచౌకు పోలీసులు సోమవారం పెన్నానదిలో గాలింపు చర్యలు చేపట్టారు. మూడు డ్రోన్ కెమెరాల సాయంతో బాలుడి ఆచూకీ కోసం పరిశీలిస్తున్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కొట్టుకుపోయి ఉంటాడనే అనుమానంతో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. చిన్నచౌకు సీఐ తేజమూర్తి, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టినా బాలుడి ఆచూకీ లభించలేదు. దీంతో అటు సిద్దవటం పోలీసుల సహకారంతో బాలడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేదు. రాత్రి కావడంతో బుధవారం ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టనున్నారు.

గంజాయి ముఠా అరెస్టు



నిందితులను చూపుతున్న సీఐ, ఎస్ఐలు

చాపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంచుపల్లె గ్రామం చెరువు గట్టపై మంగళవారం గంజాయి కలిగిన ముఠాను పోలీ సులు అరెస్టు చేశారు. మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్, ఎస్ఐ చిన్నపెద్దయ్య వివరాల మేరకు.. గుంటూరుకు చెందిన తిరుమలరావు అక్కడ నుంచి గంజాయి తీసుకొచ్చి ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన మేకల సునీల్, సురసుర శ్రీనివాసులు, గుర్రం రమేష్, పాపగాళ్ల సుధీర్‌లకు విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. వీరి వద్ద నుంచి 1కేజీ700 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీని విలువ సుమారు రూ.18 వేలు ఉంటుందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

ముద్దనూరు నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి మంగపట్నం గ్రామానికి చెందిన బోడెద్దుల జగదీశ్వరరెడ్డి (27) అదృశ్యమ య్యాడు. నెల రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి ఇప్పటి వరకు రాలేదని అతని తండ్రి గోపాల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రాంబాబు తెలిపారు.

మెరుగ్గా గురుకులం విద్యార్థుల ఆరోగ్యం



చికిత్సపొందుతున్న వర్షిణి, విద్యార్థిని తల్లితో మాట్లాడుతున్న ఎంఈవో

కొండాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో పాముకాటుకు గురై చికిత్స పొందుతున్న వర్షిణి, పల్లవి అనే విద్యార్థినుల ఆరోగ్యం మెరుగ్గా ఉన్నట్లు ప్రిన్సిపల్ కృష్ణవేణి తెలిపారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న పల్లవి దాదాపు కోలుకుందని ప్రిన్సిపల్ తెలిపారు. ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వర్షిణిని ఎంఈవో రామయ్య మంగళవారం పరామర్శించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రస్తుతం ఆరోగ్యం మెరుగ్గా ఉన్నట్లు వైద్యులు తెలిపారని ఎంఈవో తెలిపారు. ప్రిన్సిపల్ ప్రొద్దుటూరు హాస్పిటల్‌లోనే ఉంటూ విద్యార్థిని వర్షిణి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్నారు. కాగా గురుకుల పాఠశాలలో తక్షణం మౌలిక వసతులను కల్పించా లని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆదేశించారని.. ఈమేరకు ప్రొక్లెయిన్‌తో పాఠశాలలో మంగళవారం చెత్త చెదారాన్ని తొలగించినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, మండల బీజేపీ నేత శంకర్‌రెడ్డిలు తెలిపారు.

ఘనంగా కొండయ్యస్వామి పుట్టినరోజు వేడుకలు



భక్తుడికి కేకు తినిపిస్తున్న కొండయ్యస్వామి

మైదుకూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అవధూత కొండయ్యస్వామి పుట్టిన రోజు వేడుకలను ధరణి తిమ్మాయపల్లెలో మంగళవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. కొండయ్యస్వామికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపేందుకు ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా కొండయ్యస్వామి చేతుల మీదుగా భారీ కేకు కట్ చేసి భక్తులకు పంచిపెట్టారు. కేకులను తీసుకునేందుకు భక్తులు క్యూలు కట్టారు. వేడుకలకు వచ్చిన భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జబర్దస్త్ ఆర్టిస్టుల కామిడీ ప్రోగ్రామ్ పలువురిని అలరించింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో తిమ్మయపల్లె గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. హరికథ కాలక్షేపానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

వక్తృత్వ వ్యాసరచన పోటీలకు విశేష స్పందన

కడప ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో విద్యారంగంపై సాంకేతికత ప్రభావం అనే అంశంపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. మంగళవారం వైవీయూ మైనార్టీసెల్, బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మేటిక్ విభాగం కన్వీనరు ప్రొఫెసరు రియాజున్నీసా ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. విద్యారంగం సాంకేతికత రెండూ వేరు చేసి చూడనంతగా కలిసి పోయాయని విద్యార్థులు మాటల్లో తెలిపారు. సాంకేతికత లేకుండా విద్యారంగాన్ని ఊహించలేమన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా సైకాలజీ సహాయాచార్యులు డాక్టర్ కె.లలిత, జెనెటిక్ అండ్ జెనోమిక్ విభాగం సహాయాచార్యులు మునికుమారి ఉర్దూవిభాగం అధ్యాపకులు వ్యవహరించారు. విద్యార్థులకు జాతీయ విద్యాదినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేస్తామని ప్రొఫెసరు రియాజున్నీసా తెలిపారు.

ఎక్స్‌పోర్టర్లపై ఏపీఎండీసీ అధికారుల పక్షపాతం

- స్థానిక మిల్లుల యజమానుల నిరసన
- డిస్పాచ్ అడ్డగింత
- బుజ్జగింపులతో ఆందోళన విరమణ



ఏపీఎండీసీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మిల్లు యాజమాన్యం

ఓబులవారిపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముగ్గురాళ్ల విక్రయాల్లో మంగంపేట ఏపీఎండీసీ అధికారులు కొందరు ఎక్స్‌పోర్టర్లకే ప్రాధా న్యం ఇస్తూ తమకు అన్యాయం చేస్తున్నారంటూ స్థానిక లారీలు, మిల్లుల యజమానులు స్థానిక ఏపీఎండీసీ కార్యాలయం వద్ద నిర సన వ్యక్తం చేశారు. డిస్పాచ్‌ను అడ్డుకుని ఆందోళన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లలో అక్రమార్జనకు పాల్ప డ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికే అధిక ప్రాధాన్యమిస్తు న్నారని, ఇది ఎంతవరకు సమంజసమని ఏపీఎండీసీ పరిపాలన భవనం ముందు స్థానికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఎక్స్‌పోర్టు వ్యాపారులకు ఆదివారం రాత్రి వేలాది టన్నుల రాయి తరలింపునకు ప్రత్యేక అనుమతులు ఇవ్వడం అన్యాయమన్నారు. ముడిసరుకు ఎగుమతిని నమ్ముకుని ఏర్పాటు చేసుకున్న స్థానిక మిల్లులకు, వాటిని నమ్ముకుని బతికే కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని సీపీవోకు విన్నవించారు. అధికారులు, మిల్లుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి న్యాయం చేస్తామని టీడీపీ యువ నాయకులు ముక్కా సాయి వికాస్‌రెడ్డి ద్వారా ఎమ్మెల్యే శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సందేశం పంపడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కల్లా చలపతి, బీజేపీ నాయకులు పులపత్తూరి రామసుబ్బారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, గునిపాటి రాయుడు, గునిపాటి వేణుగోపాల్, లారీ యజమానులు, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్పీఎఫ్ ఎస్ఐ శివ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెన్నపేరూరు గ్రామ సమస్యపై ప్రభుత్వానికి నివేదిస్తాం



పెన్నపేరూరు గ్రామాన్ని సందర్శిస్తున్న ఇరిగేషన్ అధికారులు

ఒంటిమిట్ట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెన్నపేరూరు గ్రామంలో సోమశిల వెనుకజలాల ద్వారా ఇళ్లు నీటమునగడంతో మంగళవారం ఇరిగేషన్ అధికారులు గ్రామాన్ని సందర్శించారు. సోమశిల ఇరిగేషన్ ఎస్ఈ ఎంవీ వెంకటరామిరెడ్డి, ఈఈ వీవీ వెంకటరమణారెడ్డి, డీఈ శ్రీనివాస్‌కుమార్, ఏఈ శివప్రసాద్‌లు గ్రామానికి వెళ్లి పరిశీలించారు. గతంలో సోమశిల జలాశయంలో 74 టీఎంసీలు పెట్టడంతో గ్రామంలో చుట్టూ నీరు చేరి కాలనీలు నీటమునిగాయని.. దీనిపై ప్రభుత్వానికి అధికారులు నివేదించారు. గత ప్రభుత్వం గ్రామానికి చుట్టూ కాంక్రీట్‌వాల్ నిర్మించాలని నిర్ణయం తీసుకోవడం.. గ్రామస్థులు తమకు పరిహారం ఇవ్వాలని అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి స్థానిక నాయకుల ద్వారా ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. దీంతో కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో మళ్లీ అధికారులపై స్థానిక నాయకులు ఒత్తిడి తీసుకువచ్చి తమకు పరిహారం అందించేందుకు నివేదిక పంపించాలని అభ్యర్థించారు. పెన్నపేరూరు గ్రామంలోని ఇళ్లకు పరిహారం అందించేందుకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరోసారి గ్రామాన్ని సందర్శించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తారని ఎస్ఈ వెంకటరామిరెడ్డి తెలిపారు. పూర్తిస్థాయి నీటి మట్టం 78 టీఎంసీలు పెడితే ఏ మేరకు వెనుకజలాలు గ్రామానికి వస్తాయనే దానిపై క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పరిహారంపై నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని.. తమ పరిధిలో లేదని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

వైవీయూ కళాశాలకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్



విద్యార్థులను అభినందిస్తున్న వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు పద్మ, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ రెండో దశ అంతర్ కళాశాలల పోటీల్లో వైవీయూ కళాశాల ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించింది. విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల పోటీల్లో భాగంగా వ్యాయామ విద్య, క్రీడా శాస్త్రాల విభాగంలో ఈనెల 3న నిర్వహించిన వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్, రైఫిల్ షూటింగ్, బెస్ట్ ఫిజిక్స్ క్రీడల్లో అత్యధిక పతకాలు సాధించి తన ఘనత చాటింది. పతకాలు సాధించిన క్రీడాకారులను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి, వ్యాయామ విద్య క్రీడ శాస్త్రాల విభాగాధిపతి డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి అభినందించారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

- ద్వితీయ స్థానంలో నిలిచిన జిల్లా బాలికల జట్టు





టీం చాంపియన్‌షిప్ సాధించిన బాలురు, బాలికలు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జికారోనేషన్ క్లబ్ ఇండోర్‌స్టేడియంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కడప డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు నిరంతరం సాధన చేసి క్రీడానైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. ద్వితీయస్థానంలో నిలిచిన కడప జిల్లా బాలికల జట్టును ఆయన అభినందించారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో రాణించాలన్నారు. టీం చాంపియన్ షిప్ బాలికల విభాగంలో గుంటూరు ప్రథమస్థానంలో నిలువగా, కడప ద్వితీయస్థానంలో, కృష్ణా జిల్లా తృతీయ స్థానంలో నిలిచింది. బాలుర విభాగంలో చిత్తూరు జట్టు ప్రథమస్థానంలో నిలువగా పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ద్వితీయస్థానంలో, కర్నూలు జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. విజేతలకు ట్రోఫీ, మెడల్స్‌ను అందజేశారు. ప్రతిభ కనపరిచిన క్రీడాకారులు త్వరలో మధ్యప్రదేశ్‌లో జరుగనున్న జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారద, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జిలానీబాష, అబ్జర్వర్ శ్రీనివాసరావు, అరుణ, విజయప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పెనగలూరుకు కలెక్టర్..

పెనగలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు మండల పర్యటనకు బుధవారం కలెక్టర్ రానున్నారని ఎంపీడీవో విజయరావు తెలిపారు. అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారన్నారు. మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను తనిఖీ చేస్తారన్నారు.

విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడుగా మనోహర్

రాయచోటిటౌన్, నవంబరు5(ఆంధ్రజ్యోతి): డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడుగా యండపల్లి ఎగువ హరిజనవాడకు చెందిన బండకింద మనోహర్ నియమితులయ్యారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కమిటీలో 11 మంది సభ్యులుండగా అందులో రాయచోటి మండలానికి చెందిన బండకింద మనోహర్, రామాపురం మండలం చిట్లూరుకు చెందిన వెంకట్రమణ, లక్కిరెడ్డిపల్లెకు చెందిన రాజశేఖర్‌ను సభ్యులుగా నియమించారు.

ఎంపీడీవోకు సన్మానం

ఓబులవారిపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఐదేళ్లపాటు ఎంపీడీవోగా పనిచేసిన విజయరావును మండల సర్వసభ్య సమావేశం సందర్భంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో మల్‌రెడ్డి పూర్వ ఎంపీడీవో విజయరావుకు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆయన చేసిన సేవలను కొనియాడారు. బదిలీ అయిన తనను పిలిపించి సన్మానం చేసిన ప్రస్తుత ఎంపీడీవో, తహసీల్దారు, ప్రజాప్రతినిధులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

నేడు సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



ఊరేగుతున్న సీతారాముల విగ్రహాలు

పుల్లంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కోనెయ్యగారిపల్లెలో బుధవారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సీతారాముల విగ్రహాలకు పూజలు, అభిషేకాలు, అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రంలో గ్రామోత్సవం నిర్వహించారు. డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి ధర్మపత్ని భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగపిచ్చిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గాలివీడు: మండలంలోని చీమలచెరువుపల్లి పంచాయతీ కొప్పలవాండ్లపల్లెలో కోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ప్రాతఃకాల పూజలు, యంత్రములకు పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, గణపతి, లక్ష్మి నారాయణ హోమాలు, అనుష్ఠాన జపాలు, మహామంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ చేశారు. 6న విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలుంటాయని నిర్వాహకులు తెలిపారు.

భగవద్గీత శ్లోకాల కరపత్రాలు విడుదల

రాజంపేట టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మన్నూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం భగద్గీత శ్లోకాల కరపత్రాలను ఆవిష్కరించారు. గీతా జయంతిని పురస్కరించుకుని డిసెంబరు 1న మన్నూరు ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి భగద్గీత పోటీలు నిర్వహిస్తున్నట్లు మన్నూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పరిమళ, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు, ధర్మాచార్యులు గంగన పల్లి వెంకటరమణ, ధర్మ ప్రవచకులు కొత్తపల్లె నరసింహులు తెలిపారు.

ముమ్మరంగా పశుగణన

సిద్దవటం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామస్వామిపల్లెలో మంగళవారం పశుగణన కార్యక్రమం నిర్వహించామని వెటర్నరీ వైద్యాధికారి శివశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వేతో మండల పరిధిలో అన్ని గ్రామ పంచాయతీల్లో పశువుల సంఖ్య తెలుసుకోవడానికి వీలు కలుగుతుందని వివరించారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం

- వీధుల్లోకి రాని చెత్త వాహనాలు...
- ప్రజల్లో విష జ్వరాల భయం
- పట్టించుకోని పంచాయతీ సిబ్బంది.

రైల్వేకోడూరు(రూరల్), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని క్లీన్ ఆంధ్రగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుండగా, కోడూరు పంచాయతీ అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్తను సేకరించే పంచాయతీ వాహనాలు రెండు మూడు రోజులకు ఒకసారి కూడా ఇళ్ల వద్దకు రాకపోవడంతో చాలామంది చెత్తను వీధుల్లోని చెత్తకుండీల్లో పడేస్తున్నారు. వాటిని కూడా పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో చెత్త రోడ్డుపైకి చెల్లాచెదురుగా విస్తరిస్తోంది. దీంతో రోడ్డుపై వెళ్లేవారితోపాటు , చుట్టుపక్కల నివసించే వారు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

చెత్త నిల్వల కారణంగా ఈగలు, దోమలు పెరిగిపోయి విష జ్వరాలు, అంటు వ్యాధులు విజృంభిస్తాయేమోనని ఆందోళనకు గురవుతున్నారు. ఈ సమస్యలపై పంచాయతీ కార్యాలయానికి వెళ్లి విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు సకాలంలో స్పందించి చెత్తను తొలగించాలని కోరుకుంటున్నారు



గాంధీనగర్‌లో రోడ్డుపై చెత్త



రైల్వేస్టేషన్ రోడ్డులో నిండిన చెత్తకుండీ

పంచాయతీ అధికారులు స్పందించాలి..

రెండు మూడు రోజులకోసారి కూడా చెత్త బండి రావడం లేదు.. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు.

- పఠాన్ సిరాజున్

చర్యలు తీసుకుంటాం

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. చెత్తను సకాలంలో తొలగించడంతో పాటు బ్లీచింగ్ పౌడర్‌ను చల్లుతున్నాం. చెత్త వాహనాలను ఇంటింటికి పంపిస్తాం.

- ప్రసాద్ రావు, పంచాయతీ ఈవో

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి : సుగవాసి



కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి

రాజంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ కార్యక్రమంలో ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని రాజంపేట నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాల సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. మంగళవారం రాజంపేట మున్సిపాలిటీ, రూరల్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం 100 రూపాయలతో సభ్యత్వం తీసుకుంటే 5 లక్షల బీమాతో పాటు, లక్షలాది మంది సభ్యులున్న టీడీపీ కుటుంబంలో సభ్యుడిగా చేరవచ్చునన్నారు. దీంతో అతని కష్టసుఖాల్లో పార్టీ పాలు పంచుకుంటుందన్నారు. ప్రతి ఒక్కరిని టీడీపీలో చేర్పించి పార్టీని విజయపథంలో తీసుకెళ్లేందుకు ఇప్పటినుంచే సమాయత్తం కావాలన్నారు. సభ్యత్వ నమోదులో రాజంపేట నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలపడానికి అన్నివిధాలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, రాజంపేట పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యా సంస్థల అధినేత ఎస్వీ రమణ, మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, పట్టణ మాజీ అధ్యక్షుడు సంజీవరావు, మండల మాజీ ఉపాధ్యక్షుడు నాగసుధాకర్‌రెడ్డి, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కొండా శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, ఆర్యవైశ్య సంఘం నాయకులు రమేష్, భువనగిరిపల్లె నాయకులు నరసింహ, మాజీ సర్పంచ్ ఎంఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: యూటీఎఫ్



డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నేతలు

రాయచోటిటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలంటూ యూటీఎఫ్ నాయకులు మంగళవారం డీఈవో సుబ్రమణ్యంకు విన్నవించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌మాట్లాడుతూ స్కూల్ గ్రాంట్లు పాఠశాలల పీఎఫ్ఎంఎస్ ఖాతాలకు జమ చేయాలన్నారు. 2023లో పదో తరగతి పరీక్షల నిర్వహణ, మూల్యాంకనానికి సంబంధించిన నిధులు ఇంతవరకు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. 2024లో ఆంగ్లం, ఫిజికల్ సైన్స్, బయాలజీ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు డీఏ చెల్లించలేదన్నారు. పని సర్దుబాటు ప్రక్రియతో ఏర్పడే అసంబద్ధాలు సవరించాలని, 2022, 2024 సంవత్సరాల్లో పదో తరతి సప్లిమెంటరీ పరీక్షలు విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయులకు, స్కూల్ అసిస్టెంట్లకు, 2024 మేలో సార్వత్రిక ఎన్నికల్లో పనిచేసిన ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని కోరారు. చిట్వేలు మండలంలో 7 పాఠశాలల్లో ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేరన్నారు. ఉర్దూ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. చిట్వేలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్లస్ టు పాఠశాలగా ఏర్పాటు చేశారే కానీ, పీజీ టీచర్ల పోస్టులను భర్తీ చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్, శ్రీధర్‌రెడ్డి, పురం వెంకట్రమణ, రాష్ట్ర కౌన్సిల్ శివారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రారెడ్డి, నాయకులు వెంకటయ్య, చిన్నరెడ్డెప్ప, లక్ష్మిరమణ, రాజు, వెంకట్రమణ, నాగరాజు, శశికరణ్, నరసింహారెడ్డి, అమీన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి పూజలు



రాజంపేటలో పూజలు చేస్తున్న మహిళలు



చిట్వేలిలో..



పెనగలూరులో..

చిట్వేలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాగులచవితిని పురస్కరించుకొని మంగళవారం వేడుకలను స్థానిక శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో నాగుల విగ్రహాలకు, పుట్టకు దారాలు చుట్టి పాలుపోసి పూజలు చేశారు.

నందలూరు: మండలంలో పుట్టలకు మహిళలు పూజలు చేశారు. ఉపవాసాలు ఉండి పుట్టకు దారా లు చుట్టి పూలతో అలంకరించి పూజలు చేశారు.

సిద్దవటం: మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని గంగాభవాని ఆలయ ప్రాంగణంలోని పుట్టకు మహిళలు పూజలు నిర్వహించారు.

రాజంపేట: పట్టణంలో మహిళలు పెద్దఎత్తున నాగ పూజలు నిర్వహించారు. నాగదేవతకు ప్రదక్షిణ లు చేశారు.

పెనగలూరు: కంబాలకుంటలో కొర్రపాటి నాగశివయ్య ఆచారి, శివకుమారి దంపతుల అధ్యక్షతన చంద్రశేఖర్‌స్వామి సహకారంతో నాగకన్య నాగమ్మ, నాగదేవత విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. పి.కొత్తపల్లెలో రంగమ్మ చెరువుకట్టపై ఉన్న నాగదేవతలకు తలమంచి రమణారెడ్డి, చంద్రకళ దంపతుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. బోడమల్లేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైల్వేకోడూరు: మండలంలో మంగళవారం నాగుల చవితి పండుగ నిర్వహించారు. రైల్వేకోడూరు పట్టణంలోని రంగనాయకులపేట, భుజంగేశ్వర స్వామి ఆలయాల్లో నాగులకు పాలు పోసి పూజలు చేశారు.

చీడపీడలు లేని మొక్కలను ఎంపిక చేసుకోవాలి

రైల్వేకోడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు చీడపీడలు లేని మొక్కలను ఎంపిక చేసుకోవాలని రైల్వేకోడూరు ఏవో జి. సుధాకర్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఉప్పరపల్లె, మైసూరివారిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరైతు ప్రీమియం చెల్లించి బీమా సదుపాయం పొందాలని సూచించారు. సువెన్ కంపెనీ మేనేజర్ కొండారెడ్డి మాట్లాడుతూ పామోలి న్ సాగు చేసుకునే రైతులకు ఉచితంగా మొక్కలు ఇచ్చి, ఎరువులకోసం నాలుగేళ్ల పా టు ఎకరాకు రూ. 2వేలు చొప్పున నగదు చెల్లిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దవటం : సిద్దవటం మండలం వంతాటిపల్లె ఎస్.రాజంపేట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మండల అధికారి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ వరిలో ఉత్తమ యాజమాన్య పద్ధతులను రైతులు తెలుసుకోవాలని, వేరుశనగ విశిష్ట రకాన్ని రబీలో నవంబరు 15 నుంచి డిసెంబరు 15 లోపు సాగు చేసుకోవాలని తెలియజేశారు. ఆకుముడత, పచ్చదోమ, ఆకునల్లి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్ర వ్యవసాయ సహాయకులు ప్రేమ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగాన్ని బాధ్యతగా భావించాలి

చిట్వేలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కార్యకర్తలు ఉద్యోగాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని సీడీపీవో రాజేశ్వరి సూచించారు. మంగళవారం చిట్వేలి ప్రాజెక్టు పరిధిలోని కేకే వడ్డిపల్లె కాలనీలో ఈసీసీఈ డే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ప్రీ స్కూల్ పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించి వారి శారీరక, మానసిక బావోద్వేగ భాషాభివృద్ధిపై తల్లులకు వివరించడమేగాకుండా ఆట పాటల ద్వారా విద్యను బోధించే విధానాన్ని వివరించారు. శిశువుకు మొదటి గురువు తల్లి అని, బిడ్డల ఎదుగుదలలో తల్లి పాత్ర కీలకమన్నారు. అంగన్వాడీ వర్కర్‌లు ఉద్యోగాన్ని ఒక సామాజిక బాధ్యతగా భావించి పిల్లల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-1 సూపర్‌వైజర్‌లు వసుంధరమ్మ, విజయకుమారి, విశాలాక్షి, సురేఖరాణి, అంగన్వాడీ వర్కర్‌లు, హెల్పర్లు, తల్లిదండ్రులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలతో భూ సమస్యల పరిష్కారం



లక్కిరెడ్డిపల్లె: గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి); గ్రామ సభల ద్వారా భూసమస్యలు పరిష్కరించుకోవచ్చుని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండలంలోని మద్దిరేవుల ఈడిగపల్లె సచివాలయంలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ రీ సర్వేలో తప్పులుంటే రెవెన్యూ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. పూర్వీకుల నుంచి వచ్చిన భూ సమస్యలు, దానవిక్రయం సమస్యలు కూడా పరిష్కరించు కోవచున్నారు. వీఆర్వోలు, మండల, గ్రామ సర్వేయర్లు ప్రజలుకు అందుబాటులో ఉండి భూ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మద్దిరేవుల సర్పంచు చంద్రమ్మ, సర్వేయర్ మదన్ మోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సిరిబాబు, సచివాలయ సిబ్బంది ఓంప్రకాశ్, లావణ్య టీడీపీ నాయకులు బాబుల్‌రెడ్డి, కావలి ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

రామాపురం: గ్రామంలో ఇటీవల జరిగిన రీసర్వేతో ఏర్పడ్డ భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభ నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ కృపావతి తెలిపారు. మండలంలోని చిట్లూరులో సర్పంచ్ రామాంజులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చిట్లూరు గ్రామంలో ఇటీవల కాలంలో 5114.04 ఎకరాల్లో రీ సర్వే చేశారన్నారు.. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామాంజులు, ఆర్ఐ, మండల సర్వేయర్ మధుసూదన్‌రెడ్డి, వీఆర్‌వో, స్థానిక నాయకులు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

టీకాల లక్ష్యం వంద శాతం సాధించాలి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో కొండయ్య

సుండుపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వ్యాధి నిరోధక టీకాలు వందశాతం వేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య ఆదేశించారు. మంగళవారం రాయవరం ప్రాథమిక వైద్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంద రోజుల్లో లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. నవంబరు 14 నుంచి అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలను పరిశీలించాలని, కేన్సర్ కేసులు సర్వే చేసి ఎవరైనా బాధితులు ఉంటే వైద్యం చేయించాలన్నారు. నీటి పరీక్షలు చేసి, పల్లెల్లో తాగు నీరు శుభ్రంగా ఉందా లేదా విషయాలను ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శేఖర్‌రెడ్డి, డాక్టర్ రుబీనా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం



సీఎం , మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

రాయచోటిటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో క్రీడాకారుల కోటాను 3 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం, జిల్లా తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం డీఈవో కార్యాలయ ఆవరణలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఏపీ పీఈటీ అండ్ సేఫ్ అసోషియేషన్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, అధ్యక్షుడు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాలు పీడిస్తున్నా పట్టించుకోరా: సీపీఐ

రైల్వేకోడూరు, నవంబరు 5:(ఆంధ్రజ్యోతి) విష జ్వరాలతో ప్రజలు సతమతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండల సీపీఐ కార్యదర్శి దార్ల రాజశేఖర్ ఆరోపించారు. మంగళవారం రైల్వేకోడూరు సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో విష జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రెక్కాడితేగానీ డొక్కాడని పేదలు విషజ్వరాల బారినపడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో శెట్టిపల్లి పెంచలయ్య, మొగిలి వినయ్ పాల్గొన్నారు.

జీవనోపాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

వీరబల్లి, నవంబరు5(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డినేటర్ కొండా శ్రీనివాసులరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన సిబ్బంది సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు జీవనోపాధి ఏర్పాటుపై అవగాహన కల్పించాలని కోరారు. షికారుపాలెంలోని సంఘ సభ్యులు తయారు చేసే ప్లాస్టిక్ పూల ఆన్‌లైన్ వ్యాపారానికి నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించామని త్వరలో అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. అర్హత గల అన్ని సంఘాలకు రుణాలు ఇప్పిస్తున్నామని, రుణాలు సక్రమంగా చెల్లించేలా సిబ్బంది పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏపీఎం ఖాదర్‌వలి, సీసీలు కృష్ణయ్య, నాగేంద్ర, సుధాకర్, గంగాధరం, వీవోఏలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

సిద్దవటం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : హౌసింగ్ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఏఈ చెన్నయ్య సూచించారు. మండలంలోని మాధవరం, ఎస్కే నగర్ ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ గృహనిర్మాణాలకు ఇచ్చిన గడువు పూర్తయిందని, వెంటనే పనులు పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత బిల్లులు మీ ఖాతాలో జమ చేస్తామని, నిర్లక్ష్యం చేస్తే బిల్లులు కూడా ఆగిపోతాయని హెచ్చరించారు.

ప్రభుత్వ కళాశాలలో అపార్‌పై అవగాహన

ఓబులవారిపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిదిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన అపార్ నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మనీషా కుమారి తెలిపారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి అపార్ నమోదు చేయడం ద్వారా కలిగే ఉపయోగాలను ఎంపీడీవో మల్‌రెడ్డి, మండల విద్యాశాఖాధికారి రెడ్డయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బర్త్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

పుల్లంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి విద్యార్థులందరూ బర్త్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు అరవింద్‌కిషోర్ సూచించారు. అపార్ కార్డుకు బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరి అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థుల ఆధార్ కార్డులను ప్రధానోపాధ్యాయుడికి గాని, పంచాయతీ కార్యదర్శికి గాని అందజేసి బర్త్ సర్టిఫికెట్ పొందవచ్చునన్నారు. ఆధార్ కార్డు లేకున్నా, ఆధార్ కార్డులో తప్పులున్నా సరిచేసి బర్త్ సర్టిఫికెట్ మంజూరు చేస్తారన్నారు.

అపార్ ఐడీ సెంటర్ ప్రారంభం

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అపార్ ఐడీకి సంబంధించి విద్యార్థుల జనన తేదీ నమోదు తదితరాల కోసం స్థానిక మండల సభా భవనంలో ఏర్పాటు చేసిన అపార్ ఐడీ అప్డేట్ సెంటర్‌ను ఎంఈఓ చక్రేనాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో గురుప్రసాదు మాట్లాడుతూ విద్యార్థులు అపార్ ఐడి ఆధార్‌లో పుట్టినతేది, ఇంటిపేరు అప్‌డేట్ చేయించుకోవచ్చునన్నారు. పోస్టాఫీసులో కూడా ఈ సౌకర్యం ఉంద న్నారు

వలంటీర్ల ఆవేదన సదస్సు విజయవంతం చేయాలి

రాజంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వలంటీర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 9న విజయవాడలో నిర్వహించనున్న వలంటీర్ల ఆవేదన సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం పట్టణంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మహేష్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శివరామకృష్ణదేవర మాట్లాడుతూ వలంటీర్లు ఎంతో కష్టపడి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి తీసుకెళ్లారన్నారు. కేవలం 5 వేల జీతంతో విధులు నిర్వహించారన్నారు. 10 వేలు జీతం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు ఆ తర్వాత వారిని పట్టించుకోలేదన్నారు. ఈ సమస్యపై ఈనెల 9న విజయవాడలో జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా నాయకులు సరోజనమ్మ, వలంటీర్ల సంఘం నాయకులు సాయికృష్ణ, మీనాప్రసాద్, గురుమూర్తి, శివ, రాజేష్, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

సిద్దవటం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా విక్రయిస్తున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మండల పరిధిలోని వెలుగుపల్లెలో సుబ్బరాయుడు అనేవ్యక్తి మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో మంగళవారం దాడులు నిర్వహించామన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని 6 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు వివరించారు.

బైక్‌ను ఢీకొన్న కారు ఒకరికి తీవ్ర గాయాలు




తీవ్రంగా గాయపడిన సయ్యద్ ఖాదర్‌వలి

రామాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా, మరొకరు స్వల్పంగా గాయపడినట్లు ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం కడప నుంచి రామాపురం వైపు వస్తున్న కారు కసిరెడ్డిపల్లె పంచాయతీ కొత్తరోడ్డు నారాయణపురం సమీపంలో ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొని వెళ్లి పోయింది. దీంతో బైక్‌పై వెళుతున్న ఇద్దరిలో సయ్యద్ ఖాదర్‌వలి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చెక్‌పోస్టు పోలీసు సిబ్బంది కారును అదుపులోకి తీసుకున్నారు. రామాపురం పోలీసులు గాయపడిన వారిని 108లో కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బడిపంతుల గడ్డ.. పిట్టిగుంట

మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అంటారు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల తర్వాత స్థానం ఉపాధ్యాయుడిది. అలాంటి గురువులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది ఆ గ్రామం. కేవలం 75 కుటుంబాలున్న ఆ గ్రామంలో ఎక్కువమంది ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు. ఓ ఇంజనీరు తప్పుచేస్తే తాను నిర్మించిన బ్రిడ్జి మాత్రమే కూలిపోతుంది. ఉపాధ్యాయుడు తప్పుచేస్తే సమాజమే పెడదారి పడుతుందంటారు పెద్దలు. అలాంటి బాధ్యతాయుతమైన ఉపాధ్యాయ కొలువులతో గ్రామానికే వన్నె తెస్తున్నారు.

• ఓ కుగ్రామంలో 38 మంది ఉపాధ్యాయులు • సంపూర్ణ అక్షరాస్యత • ఆదర్శ గ్రామంగా గుర్తింపు



కాశినాయన, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాశినాయన మండలంలోని పిట్టిగుంట గ్రామంలో దాదాపు 75 కుటుంబాలున్నాయి. దాదాపు ఓకే సామాజికవర్గం. వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఉన్న ఓ కుగ్రామం అది. సువిశాలమైన వ్యవసాయ భూములులేవు.. మంచి గుర్తింపు ఉన్న నాయకులు లేరు.. సంపన్నులూ అక్కడ లేరు. ఒక సాధారణమైన దిగువ మధ్యతరగతి వారు నివసించే పల్లెటూరు. రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేదలు అధికంగా ఉండేవారు. 1955 సంవత్సరం నాటికి ఆ గ్రామంలో నిరక్షరాస్యత పేదరికం జంటగా ఉండేవి. కేవలం వేళ్లమీద లెక్కించే సంఖ్యలో మాత్రమే గ్రామంలో అక్షరజ్ఞానం కలిగిన వారు ఉండేవారు.

గ్రామంలో తిండికి సంపాదించకోవడమే అతి కష్టంగా ఉండే రోజులవి. అలాంటి రోజుల్లో గ్రామం నుంచి కలసపాడు, పోరుమామిళ్లకు దాదాపు రోజుకు 20 కి.మీ దూరం నడిచిపోయి వస్తూ కొంతమంది యువకులు చదువుకున్నారు. బతకలేక బడిపంతులు అనే నానుడి ఉన్న ఆ రోజుల్లోనే పలువురు యువకులు ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీ, హైయ్యర్ గ్రేడ్ లాంటి చదువులు చదివి అవసరమైన ట్రైనింగ్‌లు పూర్తిచేసి ఉపాధ్యాయ వృత్తిలోకి దిగారు. గ్రామానికి చెందిన కీర్తిశేషులు బుసిరెడ్డి జానకిరామిరెడ్డి మొట్టమొదటగా 1962 సంవత్సరంలో నెలకు రూ.92 వేతనంతో బడిపంతుల కొలువు సంపాదించాడు.

దీంతో ఇతర పిల్లల తల్లిదండ్రుల్లో కూడా తమ బిడ్డలను అయ్యవార్లను చేయాలనే ఆలోచన రేకిత్తించింది. అనుకున్నదే తడవుగా అనతి కాలంలోనే బి.పుల్లారెడ్డి, బోయిళ్ల నర్శిరెడ్డి, బి.చెంచిరెడ్డి, పి.బాలవెంకటరెడ్డి, పివెంకటసుబ్బారెడ్డితో పాటు పదుల సంఖ్యలో ఉపాధ్యాయ కొలువులు పొందారు. దీంతో గ్రామంలో చదువుకునే యువత దృష్టి ఉపాధ్యాయ వృత్తిపై పడింది. ఒకరిని చూసి మరొకరు అన్నట్లుగా ఆ దిశగా అడుగులు వేస్తూ ఒక్కొక్కరుగా ఉపాధ్యాయ వృత్తిని సంపాదించుకుంటూ వచ్చారు. వారి సంఖ్య ప్రస్తుతం 38కి చేరింది. వీరిలో 8 మంది రిటైర్ కాగా ఐదారుగురు ప్రభుత్వ కొలువు లభించనప్పటికీ మంచి గుర్తింపు ఉన్న ప్రైవేట్ కాలేజీలైన బీఈడీ, బీటెక్, జూనియర్ కాలేజీల్లో ప్రిన్సిపల్స్‌గా, లెక్చరర్స్‌గా పనిచేస్తున్నారు.


పిట్టిగుంట గ్రామం వ్యూ

ఉపాధ్యాయులు కావాలన్నదే లక్ష్యంగా..

చిన్నగ్రామంలో ఐదారు కుటుంబాల్లో భార్య భర్త ఇద్దరూ టీచర్లుగా ఉండటం విశేషం. మునుపటి తరంవారే కాకుండా తర్వాత తరంవారు కూడా బోధనపైనే మక్కువ పెంచుకున్నారు. స్వరాష్ట్రంలో సీట్లు లభించక పోతే కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు పోయి టీటీసీ, బీఈడీ, ఎంఈడీ లాంటి ఉన్నత చదువులు చదివి బోధనలోనే స్థిరపడ్డారు. అప్పట్లో 90 శాతంమంది యువకులు ఉపాధ్యాయ కొలువు పొందాలన్నదే లక్ష్యంగా చదువులు చదివారు. దీంతో ప్రతి కుటుంబంలో ఒకరిద్దరు డిగ్రీలు, పీజీలు, టీటీసీ, బీఈడీ చేశారంటే నాటి యువతలో బోధనపై ఎంత మక్కువ ఉండేదో ఇట్టే అర్థమవుతుంది.

ఆదర్శ గ్రామం కావడంతో..

సంపూర్ణ అక్షరాస్యత ఉండటంతో చాలాకాలం క్రితమే పిట్టిగుంటను ప్రభుత్వం ఆదర్శగ్రామంగా గుర్తించింది. దీంతో మండలంలో ప్రభుత్వ పరంగా ఏ కార్యక్రమం ప్రారంభించాలన్నా పిట్టిగుంట గ్రామాన్నే అధికారులు పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేస్తారు. ఇటీవల గ్రామంలోని యువత ట్రెండ్ మారింది. ఇప్పుడు ఉపాధ్యాయ వృత్తేకాకుండా ఇతర వృత్తుల్లోకి వెళ్లేలా యువతీ యువకులు చదువుతున్నారు. ఇక్కడి యువత ప్రభుత్వ ప్రైవేట్ రంగాల్లో ఏదోఒక జీవనోపాధి పొందుతూ చుట్టుపక్కల గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది. దీనంతటికి వెనకటి తరం అయవ్వార్లదే పునాది అని నేటికీ గ్రామస్తులు, చుట్టుపక్కల మండలాల్లోని ప్రజలు గుర్తుచేస్తుంటారు.

రూ.92 జీతానికి చేరాను



పేదరికం, నిరక్షరాస్యత కవల పిల్లల్లా సంచారం చేస్తున్న రోజులవి. చదువుకోవాలని ఉన్నా చదివించలేని పేద కుటుంబాలు ఎక్కువగా ఉన్న గ్రామం మాది. బడికి వచ్చినా ప్రాథమిక దశలోనే బడి మానేసి వ్యవసాయ పనులకు వెళ్లేవారు. అలాంటి పరిస్థితుల్లో నేను మెట్రిక్యులేషన్ వరకు చదివి అనంతరం శ్రీకాళహస్తిలో ట్రైనింగ్ పూర్తిచేశాను. 1962 సంవత్సరంలో రూ.92ల జీతానికి టీచర్‌గా చేరాను.

\- బి.పుల్లారెడ్డి,
విశ్రాంత ఉపాధ్యాయుడు, పిట్టిగుంట

ఉపాధ్యాయ వృత్తిపై మక్కువ



నేను మొదట ఆర్మీలో చేరాను. కొన్నిసంవత్సరాలు దేశరక్షణలో పాలుపంచుకున్నాను. నేను బయటికి వచ్చేనాటికి గ్రామంలో ఎక్కువ మంది ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. మరికొందరు ఉపాధ్యాయ ఉద్యోగం కోసం కసరత్తు చేస్తున్నారు. నాకు ఆ వృత్తిపై మక్కువ కల్గింది. నేనూ బీఈడీ చేశాను. అనంతరం నిర్వహించిన డీఎస్సీలో సైన్సు ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యి పనిచేస్తున్నాను

\- బోయిళ్ల విద్యార్థన్‌రెడ్డి,
సైన్సు ఉపాధ్యాయుడు, పిట్టిగుంట

జీతం తక్కువ.. గౌరవం ఎక్కువ...

నేను రూ.150 జీతానికి ఉద్యోగంలో చేరాను. ఆ రోజుల్లో జీతం తక్కువైనా గౌరవం ఎక్కువగా లభించేది. గ్రామంలో దిగీదిగగానే బస్టాప్ నుంచి ఐదారు మంది ఉపాధ్యాయుడిని అనుసరిస్తూ ఆప్యాయంగా మాట్లాడుతూ బడి వరకు వచ్చేవారు. దీనికి తోడు పాత రోజుల్లో ఉపాధ్యాయులు కొంతైనా నైతిక విలువలు పాటిస్తూ వచ్చేవారు. మా గ్రామంలోని యువత కూడా మాలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు.

\- చలపతిరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు, పిట్టిగుంట



ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

చిన్నమండెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టరు ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పడమటికోన పంచాయతీ నడిగడ్డ పల్లెకు చెందిన రామంజులమ్మ (57) ఆమె భర్త నాగరాజుతో కలసి మంగళవారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని పోస్టాఫీసు వద్దకు వచ్చింది. పని ముగిసిన అనంతరం స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా చిన్నమండెం, పెద్దమండెం రహదారిలోని చాంద్ బాషా మామిడితోట వద్ద ట్రాక్టర్ ఢీకొంది. దీంతో కిందపడిన ఆమె పైనుంచి ట్రాక్టర్ వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రైవేటు భవనాల్లోకి కోర్టు

• ఆమోదం తెలిపిన ప్రభుత్వం

కలికిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా కేంద్రంలో కొన్ని కోర్టుల నిర్వహణకు తీసుకున్న ప్రైవేటు భవనాలకు అద్దె చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కడప కేంద్రంగా ఉన్న కొన్ని కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిని మరమ్మతులు చేసేందుకు వీలుకాని స్థాయిలో ఉన్నాయి. చివరికి ప్రాణాలకు హాని కలిగించే విధంగా ఉన్నందువల్ల వివిధ కోర్టుల నిర్వహణకు ప్రైవేటు భవనాలను ఎంచుకున్నారు. స్థానికంగా ఉన్న ఆక్స్‌ఫర్డ్ జే స్కూల్ భవనాలు కోర్టుల నిర్వహణకు అనువుగా ఉన్నందున నెలకు రూ.1.20 లక్షలు అద్దెగా రాష్ట్ర హైకోర్టు నిర్ణయించింది. ఐదవ అదనపు జిల్లా కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులను ఈ ప్రైవేటు అద్దె భవనాల్లో నిర్వహించేందుకు హైకోర్టు అనుమతించింది. వీటితో పాటు కడప జిల్లాకు సంబంధించి రాయచోటిలో ఉన్న మధ్యవర్తిత్వ న్యాయ సేవా విభాగం (ఎంఎల్ఎస్ఏ) కార్యాలయాన్ని కూడా ఈ అద్దె భవనాల్లో ఏర్పాటు చేసేందుకు హైకోర్టు నిర్ణయించింది. హైకోర్టు నిర్ణయించిన అద్దెను నిర్ధారించేందుకు హైకోర్టు రిజిస్ట్రారు (రిక్రూట్‌మెంట్) ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. హైకోర్టు నిర్ణయించిన అద్దెతో ప్రైవేటు భవనాల్లో కోర్టులను నిర్వహించేందుకు హైకోర్టు తీసుకున్న నిర్ణయానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర న్యాయ, శాసన సభా వ్యవహారాల శాఖ కార్యదర్శి వి.సునీత మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

రీసర్వే అర్జీలను త్వరగా పరిష్కరించాలి

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రీసర్వే ప్రక్రియలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం వెలగపూడి సచివాయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు, సర్వేశాఖ అధికారులతో సీసీఎల్ఏ జయలక్ష్మి రీసర్వే ప్రక్రియపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి కలెక్టర్ శ్రీధర్ ఈ సమావేశానికి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఇప్పటివరకు జరిగిన గ్రామ సభల్లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, సర్వేశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌వో మధుసూదనరావు, ఏడీ సర్వే భరత్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే సక్రమంగా నిర్వహించాలి : జేసీ


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్

మదనపల్లె అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితుల సర్వే సక్రమంగా నిర్వహించి వారికి పారితోషికం సకాలంలో చెల్లించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులతో సమీక్షించిన ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని, రికార్డుల గదిని పరిశీలించారు. రైతుల నుంచి వినతులను స్వీకరించారు. తట్టివారిపల్లె వద్ద రైతులు అబ్జెక్షన్ తెలిపిన ఇళ్లను, భూములను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్ భూములను సక్రమంగా సర్వే నిర్వహిచాలన్నారు. మదనపల్లె పట్టణం పరిసర ప్రాంతాల్లో చెరువులు అక్రమణకు గురైనట్లు, ప్రభుత్వ భూఆక్రమణ చాలా వరకు చేసిన విషయం తన దృష్టికి వచ్చిందని వెంటనే సర్వే నిర్వహించి ఏడు రోజుల్లో అక్రమాలను తొలగించి హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆధార్ కార్డులోని వివరాలను, లేదా పాఠశాల వివరాలతో మార్పులు చేయాలని, కరెక్షన్ చేసి వెంటనే వారికి సర్టిఫికెట్లు మంజూరు చేయాలన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి సిబ్బందిని త్వరలోనే పంపతామన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఖాజాబీ, డీటీ అస్లాం, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆక్రమణలు కూల్చివేత

• ప్రభుత్వ స్థలాలు అమ్మిన వారిపై చర్యలు : కలెక్టర్ చామకూరి శ్రీధర్


ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం

కురబలకోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు వద్ద ప్రభుత్వ స్థలంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను అధికారులు మంగళవారం కూల్చివేశారు. వివరాలిలా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతల పాపం....పేదల పాలిట శాపంగా మారింది. మండలంలోని అంగళ్లు పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 118లో రస్తా పొరంబోకు స్థలంలో 28 సెంట్ల స్థలాన్ని గత ప్రభుత్వ హయాంలో అధికార నేతలు కొంతమంది ఇష్టానుసారంగా ఆక్రమించుకుని అమ్మకాలు చేపట్టారు. ఈ స్థలానికి నకిలీ పట్టాలు సృష్టించి 12 మందికి రూ.3.50 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు అమ్మకాలు చేపట్టి సొమ్ము చేసుకున్నారు.

ఆ భూమికి పట్టాలు పొందామని ఇక అ స్థలం మాదేనని భావించి లక్షలాది రూపాయలు వెచ్చించి పలువురు నిర్మాణాలు చేపట్టారు. దీనిపై పలుమార్లు ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో నిత్యం ఆ మార్గంలో పలువురు జిల్లా, డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారులు రాకపోకలు సాగించినా అటువైపు కన్నెత్తి చూసే సాహసం చేయలేదు. అయితే కూటమి అధికారంలో రావడంతో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలానికి సంబంధించి పలువురు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో ఇటీవల తాజాగా ఆక్రమణకు గురైన భూమిలో ప్రభుత్వానికి చెందిన భూమిగా నిర్ధారిస్తూ రెవెన్యూ అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు. దీని విలువ ప్రైవేట్ మార్కెట్‌లో కోట్లలో పలుకుతుంది. కాగా మంగళవారం రెవెన్యూ అధికారులు ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణాలను యంత్రాల సాయంతో కూల్చేశారు. కాగా నేతల చేతిలో మోసపోయి అక్రమ నిర్మాణాలు చేపట్టిన బాధితులు లబోదిబోమంటున్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

కలెక్టర్ చామకూరి శ్రీధర్ మంగళవారం ఆక్రమణకు గురైన స్థలం వద్దకు చేరుకుని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే ఇంతవరకు ఎందుకు అడ్డుకోలేదని అధికారులను ప్రశ్నించారు. ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే అడ్డుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పించడంతో పాటు సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని హెచ్చరించారు.

ప్రభుత్వ స్థలాలను అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తపశ్విని, ఆర్ఐ బాలసుబ్రమణ్యం, సర్వేయర్ భువనేశ్వరి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

బొప్పాయి మొక్కలకు భలే గిరాకీ


• 30 నర్సరీల్లో బొప్పాయి మొక్కల పెంపకం • నాలుగు రాష్ట్రాలకు 30 లక్షలకు పైగా మొక్కలు సరఫరా • 2 వేల మంది కూలీలకు ఉపాధి

రైల్వేకోడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రతిఏటా బొప్పాయి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ ఏడాది లక్ష ఎకరాల్లో కోటి మొక్కలను రైతులు నాటారు. రైల్వేకోడూరులోని 30 నర్సరీల్లో బొప్పాయి మొక్కల పెంపకాన్ని చేపట్టారు. మన రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాలకు ఇక్కడి నుంచి 30 లక్షల మొక్కలను నర్సరీ వ్యాపారులు ఎగుమతి చేశారు వివరాల్లోకి వెళితే...రైల్వేకోడూరు ప్రాంతం వాణిజ్య పంటలకు కేంద్ర బిందువు. ఇక్కడ మామిడి, అరటి తరువాత బొప్పాయి పంటను రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. బొప్పాయి కాయలు సీజన్ లో మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, ఢిల్లీ, కశ్మీర్, అహ్మదాబాద్, హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాలకు ఎగుమతి చేస్తారు. గత ఏడాది బొప్పాయి గింజలు నాసిరకంగా ఉండడంతో రైతులు నిలువునా మునిగిపోయారు. దిగుబడులు ఎక్కువగా రాలేదు. అయితే కాయలు టన్ను రూ.20 వేల వరకు ధరలు పలికాయి. ఈ ఏడాది నాణ్యత గల గింజలు తెచ్చి నర్సరీల్లో పెంపకం చేశామని వ్యాపారులు అంటున్నారు. గత ఏడాదిలో ఒక్క మొక్క రూ.13కు విక్రయాలు చేశారు.

ఈ ఏడాది ఒక్క మొక్క రూ.11కు విక్రయిస్తున్నారు. డిమాండు పెరిగే కొద్ది రూ.14 నుంచి రూ.15 వరకు మొక్కలను అమ్మతారు. రైల్వేకోడూరు ప్రాంతంలో ప్రధానంగా రెడ్‌లేడి 786, తైవాన్ రకాన్ని రైతులు సాగు చేస్తున్నారు. ఎకరాకు సుమారు 1000 మొక్కలు నాటుతారు. ఎకరాకు పొలంలో బొప్పాయి సాగు చేపట్టాలంటే దుక్కులు, కూలీలు, మందులు, మొక్కలు తదితర వాటికి రూ.40 వేలు ఖర్చు అవుతుంది. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు సుమారుగా రూ.2 లక్షలు లాభం వస్తుందని రైతులు అంటున్నారు. అయితే బొప్పాయి వ్యాపారంలో దళారులు ఉన్నారు. దీంతో చాలా మేరకు రైతుకు నష్టం ఏర్పడుతోంది. మార్కెట్‌లో ధరలు లేవని దళారులు చెప్పి రైతులను నిలువునా మోసాలు చేస్తున్నారు. చాలా మంది రైతులు నేరుగా మార్కెట్‌కు కాయలు పంపిస్తున్నారు. బొప్పాయి సీజన్‌లో రైల్వేకోడూరు ప్రాంతంలో నెలలపాటు ఢిల్లీ, ముంబై తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు మకాం వేసి ఇక్కడ వ్యాపారం కొనసాగిస్తారు. బడా రైతులు వారితో సంబంధాలు పెట్టుకుని వారి కాయలను ఆ వ్యాపారులకు ఇస్తున్నారు. కాయలు కొనుగోలు చేసే ముందు ఒక రేటు కాయలు కోసిన తర్వాత మరో రేటు చెబుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రోజు 50 లారీలకు పైగా బొప్పాయి కాయలను ఇతర రాష్ట్రాలకు తరలిస్తుంటారు. 2 వేల మంది కూలీలు జీవనోపాధి పొందుతున్నారు. గుత్తి, గుంతకల్లు, అనంతపురం, కర్నూలు, తాడిపత్రి తదితర ప్రాంతాలకు చెందిన కూలీలు ఇక్కడ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అధికంగా లాభాలు వస్తున్నాయని రైతులు సాగును వదలడం లేదు. ఏదీఏమైనా బొప్పాయి కాయలకు డిమాండు తగ్గడం లేదు.


రైల్వేకోడూరు నర్సరీలో పెరుగుతున్న బొప్పాయి మొక్కలు

నాణ్యత గల మొక్కలను ఇస్తున్నాము



నాణ్యత గల మొక్కలను రైతులకు అందించాము. వైరస్ లేని మొక్కలు ఇచ్చాము. రైతులు లాభాలు తెచ్చుకోవాలంటే సేంద్రియ వ్యవసాయం చేయాలి. మొక్కలు నాటినప్పటి నుంచి జాగ్రత్తగా శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారుల సూచనలు, సలహాలు తీసుకుని రైతులు సాగు చేయాలి. బొప్పాయి సాగుకు వాతారవణం అనుకూలించాల్సి ఉంటుంది. బొప్పాయి నాటిన తర్వాత వర్షం కురవకూడదు. వైరస్ రాకుండా ఉండాలంటే నాటిన నాటి నుంచి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. లాభాలు వస్తాయని విచ్చలవిడిగా మందులు పిచికారీ చేస్తే ఇబ్బందులు వస్తాయి.

\- ఎస్.రవికుమార్‌రాజు, నర్సరీ వ్యాపారి, కోడూరు

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం

గుర్రంకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భార్యను కాపురానికి పిలిపించాలని పోలీస్‌స్టేషన్‌కు వస్తే పట్టించుకోలేదంటూ ఓ యువకుడు గుర్రంకొండ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యకు యత్నించాడు. బాధితుడి వివరాల మేరకు... తరిగొండ పంచాయతీ ఇరగన్నగారిపల్లె వాసి నరసింహులు కుమారుడు మణికి తిరుపతి జిల్లా భాకరాపేట మండలం తలకోన పంచాయతీ ఆవులయ్యగారిపల్లెకు చెందిన రమణ కుమార్తె మానసతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పది రోజుల కిందట భార్యాభర్తలిద్దరూ గొడవపడ్డారు. దీంతో మానస పిల్లలను వదిలి అమ్మగారి ఇంటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో మణి తన భార్యను కాపురానికి పిలిపించాలంటూ వారం రోజులుగా గుర్రంకొండ పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నాడు. పోలీసులు తనదే తప్పంటూ నిందించడంతో మనస్థాపానికి గురైన యువకుడు బ్లేడుతో ఎడమ చేతిపై కోసుకుని కడప-బెంగళూరు జాతీయ రహదారిపై పడుకుని నిరసన వ్యక్తం చేశాడు. అక్కడే ఉన్న పోలీసులు బాధితుడికి సర్దిచెప్పి లోపలికి తీసుకెళ్లారు. అతడి భార్యను పిలిపించి న్యాయం చేస్తామని ఎస్ఐ మధురామచంద్రుడు బాధితునికి నచ్చచెప్పాడు.


చేతిపై బ్లేడుతో కోసుకున్న దృశ్యం

నత్తనడకన కంప్యూటరీకరణ

- స్తంభిస్తున్న కార్యకలాపాలు
- పీఏసీఎస్‌లలో పంట రుణాలకు ఇక్కట్లు
- గతంలో వందల కోట్లు రుణం
- ఇప్పుడు రూ.50కోట్లు దాటని వైనం
- పైలెట్ ప్రాజెక్టు కింద నాలుగు సొసైటీలు



కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):
- ఇగో రామయ్యా.. గతంలో తీసుకున్న రుణానికి వడ్డీ కట్టాలే. చాణ రోజుల నుంచి పెండింగు చూపిస్తాంది, వెంటనే కట్టుకో లేదంటే ఇబ్బంది పడాల్సి వచ్చాది చూడు మల్ల ముందే చెబుతాండా.

! అదేందయ్యా నేనే పతిసారీ వడ్డీ కడతాండ. మీరు బుక్కుల్లో రాసుకోకండా తినేసి మళ్లా నన్ను వడ్డీ కట్టలేదంటే యాన్నించి తేవాలయ్యా సామీ, నేను కట్టలేను.

- ఇదో లచ్చుమయ్యా.. మీ నాయన సొసైటీ బాంకిలో అప్పుడు ఎప్పుడో లోను తీస్కున్నాడు. వడ్డీతో కలిపి బాకీ తీరిచ్చే.. భూమి ఉంటాది.. లేదంటే ఏలమేయాల్సి వచ్చాది.

! ఏందయ్యా మా భూమి కుదవ పెట్టి సొసైటీ బాంకిలో లోను తీసుకోని మల్లా గడువు ముందే కట్టినన్నాడు. మల్లా లోను తీసుకున్న ఇషయమే మా నాయన మాకు చెప్పలే, ఇప్పుడు ఉన్నట్టుండి భూమి ఏలం వేచ్చామంటుండరు యాందీ ఇదంతా..

ఇప్పటి వరకు ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలలో రైతులు, సొసైటీ బ్యాంకు అధికారుల మధ్య జరుగుతున్న తంతు. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సొసైటీలలో లావాదేవీలకు సంబంధించి కంప్యూటరీకరణకు శ్రీకారం చుట్టింది. అయితే ఇది నత్తనడకన సాగుతుండటంతో రైతులకు ఇబ్బందులు తప్పేలా లేవు. వివరాల్లోకి వెళితే..

గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు రుణాలు ఇచ్చేందుకు సహకారశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ (పీఏసీఎస్)లలో రికార్డుల నిర్వహణ చేతిరాతతో ఉండడంతో ఎంతో కొంత అవకతవకలకు ఆస్కారం ఉంటుంది. కొన్ని చోట్ల సిబ్బంది చేతివాటం ప్రదర్శించడం వల్ల రైతులు ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. మరికొన్ని చోట్ల డబ్బులు చెల్లించకుండా తాము కట్టాం, మీరు తినేసి మళ్లీ కట్టమంటున్నారంటూ బుకాయించేవారు ఉండే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితికి ఫుల్‌స్టాప్ పెట్టేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. పీఏసీఎస్‌లను కంప్యూటరీకరించాలని నిర్ణయం తీసుకుంది. మొదటగా కొన్ని సొసైటీలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసుకుని అవి పూర్తి కాగానే దశల వారీగా అన్ని సొసైటీలను కంప్యూటరీకరించాలని ప్రణాళిక రూపొందించారు. ఈ క్రమంలో మన జిల్లాలో మైదుకూరు ఎఫ్‌ఏసీఎస్, లక్కిరెడ్డిపల్లె, లింగాపురం, తిమ్మసముద్రం పీఏసీఎస్‌లను ఎంపిక చేశారు. వీటిలో పూర్తిస్థాయిలో కంప్యూటరీకరించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ గడువు పూర్తయినా లక్ష్యం నెరవేరలేదు.

సిబ్బందికి శిక్షణ ఇచ్చినా...

సొసైటీల కంప్యూటరీకరణ కోసం సొసైటీ సిబ్బందికి శిక్షణ కూడా ఇవ్వడం జరిగింది. కానీ వారిలో కొంతమందికి కంప్యూటరు పరిజ్ఞానం లేకపోవడంతో కంప్యూటరీకరణ నత్తనడకన సాగుతున్నట్లు తెలుస్తోంది. మొదట సెప్టెంబరు మాసాంతానికి పూర్తి చేయాలనుకున్నారు. కానీ వివిధ కారణాల వల్ల గడవు పొడిగించినట్లు తెలుస్తుంది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సొసైటీల కంప్యూటరీకరణ కోసం రూ.2500 కోట్లు నిధులు కేటాయించినట్లు సమాచారం. అయితే కంప్యూటరీకరణలో సాఫ్ట్‌వేర్ సంస్థలకు అప్పగిస్తే పనులు త్వరితగతిన పూర్తయ్యే అవకాశాలు లేకపోలేదు. కానీ రాష్ట్రస్థాయిలో సహకార శాఖ ఉన్నత అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సొసైటీల్లో కంప్యూటకీరణ పూర్తయితే రైతులకందించే రుణాలు, వడ్డీల్లో తేడాలు రాకుండా మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు వీలవుతుంది. అంతేకాకుండా రైతులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు కూడా సొసైటీల ద్వారా సాయమందించే ఆలోచనలో ప్రభుత్వం యోచిస్తోంది. ఈ తరుణంలో జిల్లా కలెక్టరు, జాయింట్ కలెక్టర్లపై కూడా రాష్ట్రప్రభుత్వం వత్తిడి తీసుకురానున్నట్లు సమాచారం.

పంట రుణాలకు ఇబ్బందులు

డీసీసీ బ్యాంకు పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల పరిధిలో సభ్యులైన రైతులకు కోట్లాది రూపాయలు పంట రుణాలు అందజేస్తారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు ప్రతి సంవత్సరం 350 నుంచి రూ.400 కోట్లు రుణాలు అందించేవారు. అయితే కంప్యూటరీకరణ పనుల వల్ల రుణాలు అందించడంలో కూడా కొంత జాప్యం జరిగే అవకాశం ఉందని చర్చ సాగుతోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.50 కోట్లు కూడా ఇచ్చే పరిస్థితులు ఉండవని అధికార యంత్రాంగం చెబుతుంది. రుణాల విషయం అటుంచితే, రికవరీలో కూడా ఆలస్యం అవుతున్నట్లు బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై జిల్లా సహకార శాఖాధికారి సుభాషిణిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. డీసీసీ బ్యాంకులోని ప్రత్యేక విభాగం కంప్యూటరీకరణను పరిశీలిస్తుందని, పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

క్రీడలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు


క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, నవంబరు5:(ఆంధ్రజ్యోతి) క్రీడలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీహైస్కూల్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లాస్థాయి వాలీబాల్ అండర్ 14 క్రీడల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడాకారులకు విద్య, ఉద్యోగాల్లో మూడు శాతానికి పెంచిందన్నారు. జిల్లాస్థాయి వాలీబాల్ క్రీడాపోటీల్లో 14 జట్లు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. డీఈఓ, డీవైఈఓ, ఎంఈఓ హాజరుకాలేదని, ప్రొటోకాల్ ఉండాలని తెలియదా అని నిర్వాహకులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. టీడీపీ నేతలు నాదేళ్ల విద్యసాగర్, నవీన్, తులసీధర్‌నాయుడు, సంఘం శ్రీనివాసులు, వేణు, ఎంఈఓ రాజగోపాల్, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఎస్టీయూ నేతలు రమణ, పీఈటీలు దేవకమ్మ, సీఎస్ నందకుమార్, గాయత్రి, వేణుగోపాల్ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా వాలీబాల్ జట్టు ఎంపిక

ఎస్. కస్తూరి(సోధిగానిపల్లె), ఎం.జననీ, భూమిక, (అరికెల) ఎం.హర్షిణి (కెనీపల్లె), పీ.లక్ష్మీ (ఏ.కొత్తూరు) కె. అనుశ్రీ(ఎస్‌వీయూ తిరుపతి), కె.వాసు (ఆర్మూగం). సి.మానస (మర్రిమాకల పల్లె), వి బిందుశ్రీ(డాక్టర్ బీఆర్ గురుకులం), పి.తనుశ్రీ(మొగలిమెట్టు), కె. శ్రీలత (చంద్ర మాకులపల్లె), స్టాండ్‌బై పి. దీక్ష (కెనీపల్లె), జి.భాగ్యశ్రీ(నేలపల్లె), బి. మౌనిక (కడపనెత్తం), బుషార పాతీమా(బీఎస్‌ఆర్‌పేట), కీర్తీ (గుడుపల్లె కేజీబీవీ), అనతాలు (ముత్తుకూరు) బాలికల వాలీబాల్ అండర్ 14 జిల్లా జట్టుకు ఎంపికయ్యారు.

బాలుర విభాగంలో....

పి.రాజు(రెడ్డివారిపల్లె), మణికంఠ(కడననెత్తం), లతీఫ్‌కుమార్(దుర్గసముద్రం), చైతన్య, ఎస్. అబ్దుల్లా(పీజీకుంట), మహ్మద్ సాధిక్, డి.ముఖే ష్‌కుమార్, టి. వెట్రీసెలీవన్, జి.జ్ఞాన చరణ్, కె. నిశాంత్, కె.జయరాం, పి.బ్లెసింగ్, ఎష్‌సాహిల్(మదనపల్లె), స్టాండ్ బై బి.చరణ్, వి.అభిలాష్‌రెడ్డి, ఎం.రామచంద్రన్‌నాయక్, ఉన్నారు.

మెరుగ్గా గురుకులం విద్యార్థుల ఆరోగ్యం


చికిత్సపొందుతున్న వర్షిణి, విద్యార్థిని తల్లితో మాట్లాడుతున్న ఎంఈవో

కొండాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో పాముకాటుకు గురై చికిత్స పొందుతున్న వర్షిణి, పల్లవి అనే విద్యార్థినుల ఆరోగ్యం మెరుగ్గా ఉన్నట్లు ప్రిన్సిపల్ కృష్ణవేణి తెలిపారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న పల్లవి దాదాపు కోలుకుందని ప్రిన్సిపల్ తెలిపారు. ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వర్షిణిని ఎంఈవో రామయ్య మంగళవారం పరామర్శించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రస్తుతం ఆరోగ్యం మెరుగ్గా ఉన్నట్లు వైద్యులు తెలిపారని ఎంఈవో తెలిపారు. ప్రిన్సిపల్ ప్రొద్దుటూరు హాస్పిటల్‌లోనే ఉంటూ విద్యార్థిని వర్షిణి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్నారు. కాగా గురుకుల పాఠశాలలో తక్షణం మౌలిక వసతులను కల్పించా లని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆదేశించారని.. ఈమేరకు ప్రొక్లెయిన్‌తో పాఠశాలలో మంగళవారం చెత్త చెదారాన్ని తొలగించినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, మండల బీజేపీ నేత శంకర్‌రెడ్డిలు తెలిపారు.

ఘనంగా కొండయ్యస్వామి పుట్టినరోజు వేడుకలు


భక్తుడికి కేకు తినిపిస్తున్న కొండయ్యస్వామి

మైదుకూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అవధూత కొండయ్యస్వామి పుట్టిన రోజు వేడుకలను ధరణి తిమ్మాయపల్లెలో మంగళవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. కొండయ్యస్వామికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపేందుకు ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా కొండయ్యస్వామి చేతుల మీదుగా భారీ కేకు కట్ చేసి భక్తులకు పంచిపెట్టారు. కేకులను తీసుకునేందుకు భక్తులు క్యూలు కట్టారు. వేడుకలకు వచ్చిన భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జబర్దస్త్ ఆర్టిస్టుల కామిడీ ప్రోగ్రామ్ పలువురిని అలరించింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో తిమ్మయపల్లె గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. హరికథ కాలక్షేపానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

వక్తృత్వ వ్యాసరచన పోటీలకు విశేష స్పందన

కడప ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో విద్యారంగంపై సాంకేతికత ప్రభావం అనే అంశంపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. మంగళవారం వైవీయూ మైనార్టీసెల్, బయొటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మేటిక్ విభాగం కన్వీనరు ప్రొఫెసరు రియాజున్నీసా ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. విద్యారంగం సాంకేతికత రెండూ వేరు చేసి చూడనంతగా కలిసి పోయాయని విద్యార్థులు మాటల్లో తెలిపారు. సాంకేతికత లేకుండా విద్యారంగాన్ని ఊహించలేమన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా సైకాలజీ సహాయాచార్యులు డాక్టర్ కె.లలిత, జెనెటిక్ అండ్ జెనోమిక్ విభాగం సహాయాచార్యులు మునికుమారి ఉర్దూవిభాగం అధ్యాపకులు వ్యవహరించారు. విద్యార్థులకు జాతీయ విద్యాదినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేస్తామని ప్రొఫెసరు రియాజున్నీసా తెలిపారు.

ఎక్స్‌పోర్టర్లపై ఏపీఎండీసీ అధికారుల పక్షపాతం

- స్థానిక మిల్లుల యజమానుల నిరసన ● డిస్పాచ్ అడ్డగింత ●. బుజ్జగింపులతో ఆందోళన విరమణ


ఏపీఎండీసీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మిల్లు యాజమాన్యం

ఓబులవారిపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముగ్గురాళ్ల విక్రయాల్లో మంగంపేట ఏపీఎండీసీ అధికారులు కొందరు ఎక్స్‌పోర్టర్లకే ప్రాధా న్యం ఇస్తూ తమకు అన్యాయం చేస్తున్నారంటూ స్థానిక లారీలు, మిల్లుల యజమానులు స్థానిక ఏపీఎండీసీ కార్యాలయం వద్ద నిర సన వ్యక్తం చేశారు. డిస్పాచ్‌ను అడ్డుకుని ఆందోళన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లలో అక్రమార్జనకు పాల్ప డ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికే అధిక ప్రాధాన్యమిస్తు న్నారని, ఇది ఎంతవరకు సమంజసమని ఏపీఎండీసీ పరిపాలన భవనం ముందు స్థానికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఎక్స్‌పోర్టు వ్యాపారులకు ఆదివారం రాత్రి వేలాది టన్నుల రాయి తరలింపునకు ప్రత్యేక అనుమతులు ఇవ్వడం అన్యాయమన్నారు. ముడిసరుకు ఎగుమతిని నమ్ముకుని ఏర్పాటు చేసుకున్న స్థానిక మిల్లులకు, వాటిని నమ్ముకుని బతికే కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని సీపీవోకు విన్నవించారు. అధికారులు, మిల్లుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి న్యాయం చేస్తామని టీడీపీ యువ నాయకులు ముక్కా సాయి వికాస్‌రెడ్డి ద్వారా ఎమ్మెల్యే శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సందేశం పంపడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కల్లా చలపతి, బీజేపీ నాయకులు పులపత్తూరి రామసుబ్బారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, గునిపాటి రాయుడు, గునిపాటి వేణుగోపాల్, లారీ యజమానులు, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్పీఎఫ్ ఎస్ఐ శివ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెన్నపేరూరు గ్రామ సమస్యపై ప్రభుత్వానికి నివేదిస్తాం


పెన్నపేరూరు గ్రామాన్ని సందర్శిస్తున్న ఇరిగేషన్ అధికారులు

ఒంటిమిట్ట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెన్నపేరూరు గ్రామంలో సోమశిల వెనుకజలాల ద్వారా ఇళ్లు నీటమునగడంతో మంగళవారం ఇరిగేషన్ అధికారులు గ్రామాన్ని సందర్శించారు. సోమశిల ఇరిగేషన్ ఎస్ఈ ఎంవీ వెంకటరామిరెడ్డి, ఈఈ వీవీ వెంకటరమణారెడ్డి, డీఈ శ్రీనివాస్‌కుమార్, ఏఈ శివప్రసాద్‌లు గ్రామానికి వెళ్లి పరిశీలించారు. గతంలో సోమశిల జలాశయంలో 74 టీఎంసీలు పెట్టడంతో గ్రామంలో చుట్టూ నీరు చేరి కాలనీలు నీటమునిగాయని.. దీనిపై ప్రభుత్వానికి అధికారులు నివేదించారు. గత ప్రభుత్వం గ్రామానికి చుట్టూ కాంక్రీట్‌వాల్ నిర్మించాలని నిర్ణయం తీసుకోవడం.. గ్రామస్థులు తమకు పరిహారం ఇవ్వాలని అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి స్థానిక నాయకుల ద్వారా ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. దీంతో కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో మళ్లీ అధికారులపై స్థానిక నాయకులు ఒత్తిడి తీసుకువచ్చి తమకు పరిహారం అందించేందుకు నివేదిక పంపించాలని అభ్యర్థించారు. పెన్నపేరూరు గ్రామంలోని ఇళ్లకు పరిహారం అందించేందుకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరోసారి గ్రామాన్ని సందర్శించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తారని ఎస్ఈ వెంకటరామిరెడ్డి తెలిపారు. పూర్తిస్థాయి నీటి మట్టం 78 టీఎంసీలు పెడితే ఏ మేరకు వెనుకజలాలు గ్రామానికి వస్తాయనే దానిపై క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పరిహారంపై నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని.. తమ పరిధిలో లేదని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

వైవీయూ కళాశాలకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్


విద్యార్థులను అభినందిస్తున్న వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు పద్మ, ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ రెండో దశ అంతర్ కళాశాలల పోటీల్లో వైవీయూ కళాశాల ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించింది. విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల పోటీల్లో భాగంగా వ్యాయామ విద్య, క్రీడా శాస్త్రాల విభాగంలో ఈనెల 3న నిర్వహించిన వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్, రైఫిల్ షూటింగ్, బెస్ట్ ఫిజిక్స్ క్రీడల్లో అత్యధిక పతకాలు సాధించి తన ఘనత చాటింది. పతకాలు సాధించిన క్రీడాకారులను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసరు రఘునాధరెడ్డి, వ్యాయామ విద్య క్రీడ శాస్త్రాల విభాగాధిపతి డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి అభినందించారు.

సీటీఎంలో 5 మెగావాట్ల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మదనపల్లె టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం సీటీఎం విద్యుత్ సెక్షన్ పరిధి గ్రామాలకు నిరవధికంగా విద్యుత్ సరఫరా చేయవచ్చని ఎస్పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవా రం సీటీఎం సబ్‌స్టేషన్ పరిధిలో అదనంగా రూ.2 కోట్లతో 5 కేఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేసిన ఎస్ఈ మాట్లాడుతూ గతంలో వ్యవసాయ విద్యుత్ సరఫరా రెండు విడతలుగా వచ్చాయని, ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో నిరవధికంగా ఏడు గంటల పాటు రెండు ఫీడర్లలో లోవోల్టేజి సమస్య లేకుండా వ్యవసాయ విద్యుత్ సరఫరా చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ ఈఈలు గంగాధర్, రమేష్, డీఈఈలు ఆదినారాయణ, సురేంద్రనాయక్, ఏఈ రమేశ్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ ఆదినారాయణ ఆత్మహత్య

బి.కొత్తకోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట నగర పంచాయతీ జనువువారిపల్లె వాసి ఆదినారాయణ అలియాస్ బాబు మంగళవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. పుంగనూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆదినారాయణ బి.కొత్తకోట పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉంటున్నాడు. స్వగ్రామంలో ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ విషయమై ఆదినారాయణ కోర్టును ఆశ్రయించాడు. మంగళవారం తెల్లవారుజామున జనువువారిపల్లె వద్ద ఉన్న తన పొలంలోకి వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. సీఐ రాజారెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. ఆస్తి తగాదాలతో విరక్తి చెందడం, అనారోగ్య కారణాలతో ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు పోలీసులకు వివరించారు. భార్య ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

పెన్నానదిలో బాలుడు గల్లంతు

- డ్రోన్ కెమెరాలతో పరిశీలన

కడప క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప నగరానికి చెందిన మణికంఠ అనే బాలుడు ఆదివారం స్నేహితులతో కలిసి చెన్నూరు సమీపంలోని పెన్నానదిలో ఈతకు వెళ్లాడు. నలుగురు స్నేహితులు తిరిగి రాగా మణికంఠ పెన్నానదిలో గల్లంతైనట్లు తెలిసింది. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు చిన్నచౌకు పోలీసులు సోమవారం పెన్నానదిలో గాలింపు చర్యలు చేపట్టారు. మూడు డ్రోన్ కెమెరాల సాయంతో బాలుడి ఆచూకీ కోసం పరిశీలిస్తున్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కొట్టుకుపోయి ఉంటాడనే అనుమానంతో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. చిన్నచౌకు సీఐ తేజమూర్తి, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టినా బాలుడి ఆచూకీ లభించలేదు. దీంతో అటు సిద్దవటం పోలీసుల సహకారంతో బాలడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేదు. రాత్రి కావడంతో బుధవారం ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టనున్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

- ద్వితీయ స్థానంలో నిలిచిన జిల్లా బాలికల జట్టు



టీం చాంపియన్‌షిప్ సాధించిన బాలురు , బాలికలు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జికారోనేషన్ క్లబ్ ఇండోర్‌స్టేడియంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా హాజరైన కడప డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు నిరంతరం సాధన చేసి క్రీడానైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. ద్వితీయస్థానంలో నిలిచిన కడప జిల్లా బాలికల జట్టును ఆయన అభినందించారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో రాణించాలన్నారు. టీం చాంపియన్ షిప్ బాలికల విభాగంలో గుంటూరు ప్రథమస్థానంలో నిలువగా, కడప ద్వితీయస్థానంలో, కృష్ణా జిల్లా తృతీయ స్థానంలో నిలిచింది. బాలుర విభాగంలో చిత్తూరు జట్టు ప్రథమస్థానంలో నిలువగా పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ద్వితీయస్థానంలో, కర్నూలు జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. విజేతలకు ట్రోఫీ, మెడల్స్‌ను అందజేశారు. ప్రతిభ కనపరిచిన క్రీడాకారులు త్వరలో మధ్యప్రదేశ్‌లో జరుగనున్న జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారద, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జిలానీబాష, అబ్బర్వర్ శ్రీనివాసరావు, అరుణ, విజయప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ సీడ్స్ ప్రాంగణ తనిఖీ

పీలేరులో ఆర్డీఓ విస్తృత తనిఖీలు


ఆయిల్ సీడ్స్ భూముల వివరాలు పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్

పీలేరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆయిల్ సీడ్స్ ప్రాంగణాన్ని రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఆయిల్ సీడ్స్ కోసం సేకరించిన భూవిస్తీర్ణం, మూతపడిన తరువాత వివిధ ప్రభుత్వ అవసరాలకు కేటాయించిన భూవిస్తీర్ణం, మిగులు భూమి గురించి స్థానిక రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో ఆర్డీఓ విస్తృత తనిఖీలు చేపట్టారు. పీలేరు-తిరుపతి మార్గంలోని ఆయిల్ సీడ్స్ ప్రాంగణం, ఎస్టీ బాలికల గురుకులం, షకూర్ థియేటర్లను పరిశీలించారు. ఆయిల్ సీడ్స్ భూములను వైసీపీ ప్రభుత్వంలోని అధికార పార్టీ నేతలు యథేచ్ఛగా ఆక్రమించుకున్నారన్న ఆరోపణల నేపథ్యంలో పీలేరులోని తమ ప్రాంగణంలో మిగులు భూములను గుర్తించి వాటి హద్దులు చూపించాలని ఇటీవల రాష్ట్ర ఆయిల్ ఫెడ్ సంస్థ జిల్లా రెవెన్యూ అధికారులను కోరింది. ఆయిల్ సీడ్స్ కోసం సేకరించిన భూవిస్తీర్ణం, మూతపడిన తరువాత వివిధ ప్రభుత్వ అవసరాలకు కేటాయించిన భూవిస్తీర్ణం, మిగులు భూమి గురించి రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గురుకులంలోని విద్యార్థినులకు ఒకే చోట బస, భోజనం, తరగతి గది ఉండడం చేసి ఆశ్చర్యపోయారు. గురుకులంలో మెరుగైన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌కేఆర్ ఆస్పత్రిలో మహిళ మరణించిన ఉదంతంపై విచారణను వేగవంతం చేయాలని సీపీఐ నేత టీఎల్ వెంకటేశ్ ఆయనకు విజ్ఞప్తి చేశారు. తహసీల్దారు భీమేశ్వరరావు, మండల సర్వేయర్ కిరణ్మయి, వీఆర్వోలు, పాల్గొన్నారు.

దగ్గుబాటి ఇంటికి నల్లారి కిశోర్


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దగ్గుబాటి

కలకడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి దగ్గుబాటి వెంకటేశ్వరరావు కలకడ బాటవారిపల్లెలో నూతన గృహప్రవేశాన్ని మూడు రోజులు నిర్వహించారు. మంగళవారం పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే వారి ఆతిధ్యాన్ని స్వీకరించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఎమ్మెల్యేని సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బరకం శ్రీనివాసులరెడ్డి, రైస్‌మిల్ రమణ, ఇంజేటి తారకేశ్వర, రెడ్డిశేఖర్, సురేంద్రనాయుడు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు



మదనపల్లె అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కోర్టులో వెలసిన గంగమ్మకు మంగళవారం ఆలయ కమిటీ ప్రత్యేక అలంకరణలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకుడు అలంకరించి అమ్మవారిని భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు రాహుకాల సమయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మకు చీర, జాకెట్లు, పొంగళ్ల నైవేద్యం సమర్పించారు. నిమ్మకాయలపై నెయ్యి వత్తులతో దీపారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు మార్పురి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు కార్యదర్శి మార్పూరి ప్రభాకర్ నాయుడు, తదితర కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

చెరువుకట్ట తవ్వి పైపు లైను ఏర్పాటు


పైపు లైను కోసం తవ్విన చెరువు కట్ట

కలికిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెడ్డివారిపల్లెలో చింతమాకులపల్లె సమీప చెరువు కట్టను అక్రమంగా తవ్వి పైపులైను వేశారని కలికిరి పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆయకట్టు చెరువు వేపులకుంట కట్ట మధ్యన తవ్వడంతో చెరువుకు ప్రమాదం ఏర్పడిందని టీడీపీ నేత రెడ్డివారి యోగేష్ రెడ్డి ఫిర్యాదు చేశారు. అంకెంవారిపల్లె మండల సచివాలయాల మాజీ సమన్వయ కర్త పసుపులేటి రెడ్డెప్ప ఈ అక్రమానికి పాల్పడ్డట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమతులు లేకుండా చెరువు కట్ట తవ్వు తుండగా వీఆర్వో అడ్డుకున్నా అర్ధరాత్రి పని పూర్తి చేశాడని ఆరోపించారు. పోలీసులు, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకుని ఆక్రమణలను తొలగించాలని కోరారు.

మర్యాదపూర్వకంగా వ్యవహరించండి

● మండల స్థాయి సమీక్షలో ఎమ్మెల్యే

పీలేరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్యాలయాలకు వచ్చే సామాన్య ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి సమీక్షలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్న ప్రజలు, అటు మండల అధికారులు, ఇటు సచివాలయ సిబ్బంది దురుసుగా ప్రవర్తించడమే కాకుండా కొన్ని చోట్ల దుర్భాష లాడుతున్నట్లు తనకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పనులు జరుగుతాయన్న నమ్మకంతో వచ్చే ప్రజలకు సంతృప్తికర సమాధానం చెప్పాలే తప్ప వారితో దురుసుగా ప్రవర్తించకూడదన్నారు. ఇకపై అటువంటి ఫిర్యాదులు వస్తే కఠిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు భీమేశ్వర రావు, ఎంపీడీఓ శివశంకర్, కూటమి నేతలు వారణాశి శ్రీకాంత్ రెడ్డి, కోటపల్లె బాబు రెడ్డి, పురం రామ్మూర్తి, మల్లెల రెడ్డిబాషా, నారే సతీశ్, పోలిశెట్టి సురేంద్ర, పసుపులేటి లక్ష్మీకర, యల్లెల రెడ్డప్ప రెడ్డి, కంచి సూరి, ఆతిఖా షఫీ, ఆర్‌బీఐ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'అవినీతి కొనసాగించాలనుకుంటే తప్పుకోండి'

కలికిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొన్ని కార్యాలయాల్లో అవినీతి విచ్చలవిడిగా మారిందని, అధికారుల తీరు మారకుంటే తానే మార్చాల్సి వుంటుందని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ఆగ్రహించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులతో ఎమ్మెల్యే నిర్వహించిన సమన్వయ సమావేశంలో పంచాయతీ వారీ ప్రజా ప్రతినిధులు, అనధికారులు, ఉద్యోగులతో విడివిడిగా మాట్లాడారు. మండలంలోని ఒక శాఖపై పుంఖానుపుంఖాలుగా ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఎమ్మెల్యే తీవ్ర అసహనానికి గురయ్యారు. పార్టీ నేతలు, కార్యకర్తలు ఆక్రమణలకు పాల్పడితే వెనకేసుకొచ్చేది లేదని ఆయన స్పష్టం చేశారు. కార్యకర్తలందరినీ ఆదుకునేందుకు కట్టుబడి వుంటానన్నారు.

లే అవుట్ల వివరాలను సిద్ధం చేయండి

మదనపల్లెలో కోమటివానిచెరువు - హార్సిలీ హిల్స్‌లో రెవెన్యూ గెస్ట్‌హౌస్ పనులు పరిశీలన

పలు పనులతో బిజీబిజీగా జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

మదనపల్లె టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పనుల పరిశీలన, ప్రారంభాలతో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ బిజీబిజీగా గడిపారు. కోమటివాని చెరువు సుందరీ కరణకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని పీకేఎం ఉడా వైస్‌చైర్మన్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్‌లో నిర్మాణంలో ఉన్న రెవెన్యూ అతిథి గృహం పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. వివరాల్లోకెళితే....

మంగళవారం స్థానిక పీకేఎం ఉడా కార్యాలయంలో పలమనేరు, కుప్పం, మదనపల్లె, బి.కొత్తకోట మున్సిపల్ కమిషనర్లు, పీకేఎం ఉడా అధికారులతో సమీక్షించిన ఆయన పీకేఎం ఉడా పరిధి ప్రాంతాల్లో ప్రభుత్వం అనుమతి, నిబంధనల ప్రకారం వున్న లే అవుట్లు, అనధికార లేఅవుట్ల వివరాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. పట్టణాల్లో బహుళ అంతస్థుల భవనాల నిర్మాణాల అనుమతి వివరాలు ఇవ్వాలని సూచించారు. పీకేఎం ఉడా నిధుల వివరాలు అడిగారు. పట్టణాల సుందరీకరణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం కోమటివాని చెరువును పరిశీలించారు. ఈ చెరువు ఆక్రమణలకు గురికాకుండా సర్వే చేయించి హద్దులు నిర్ణయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పీకేఎం ఉడా అధికారి కుముదిని, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ ఖాజాబీ పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న ఉడా వైస్‌చైర్మన్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రెవెన్యూ గెస్ట్ హౌస్ పనులు పూర్తి చేయండి

బి.కొత్తకోట నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్‌లో నిర్మాణంలో ఉన్న రెవెన్యూ అతిథి గృహం పనులను వెంటనే పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. హార్సిలీ హిల్స్ అతిథి గృహం పనులను పరిశీలించారు. విద్యుత్, ఉడ్‌వర్క్, పీఓపీ, శానిటేషన్, పెయింటింగ్ పనులు ఇంకా పెండింగ్‌లో ఉండడాన్ని గమనించారు. ఈ పనులకు అవసరమైన నిధుల కోసం వెంటనే అంచనాలు వేసి పంపాలని తహసీల్దార్ మహమ్మద్ అన్సారీని ఆదేశించారు. గతంలో ఉన్న పాత అతిథి గృహం స్థానంలో నూతన భవనాన్ని దాదాపుగా నిర్మాణం పూర్తి చేసినా చివరి దశలో పనులు పెండింగ్‌లో ఉంచడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రతిపాదనలు అందిన వెంటనే నిధులు విడుదల అవుతాయని తక్షణం పనులను పూర్తి చేయాలన్నారు. హిల్స్‌పై ఒబెరాయ్ అంతర్జాతీయ హోటల్‌కు కేటాయించిన 20.90 ఎకరాల భూమి సర్వే పనులపై ఆరా తీశారు. హిల్స్‌పై ఉన్న 105 ఎకరాల్లో ఏపీ శాఖకు ఎంత భూమి కేటాయించారు. ఎంత మిగులు ఉంది అనే విషయం స్పష్టంగా తేల్చాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ వీరాంజనేయులు, సర్వేయర్ ముబారక్, విఆర్వో వరదరాజులు, తదితరులు ఉన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి


రైతులకు సూచనలు ఇస్తున్నచంద్రనాయక్

నిమ్మనపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ పేర్కొన్నారు. రెడ్డివారిపల్లి పంచాయతీ పొలంపిలుస్తోందిలో ఆయన మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టి సారిస్తే అధిక ఆదాయం, నాణ్యమైన దిగుబడులు అందించవచ్చన్నారు. సాగు చేసిన పంటకు బీమా చేస్తే ప్రతికూల పరిస్థితుల్లో కూడా రైతు నష్టపోడన్నారు. 2024లో ఖరీఫ్ పంటలు సాగు చేసిన ప్రతి రైతుకు ఈ-పంట ధృవపత్రాలను అందజేయాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీఏ శివశంకర్, ఏఓ మురళిమోహన్, పశువైద్యాధికారి సురేష్, సిబ్బంది లక్ష్మీప్రసన్న, శ్రీకాంత్, రెడ్డిబాబు పాల్గొన్నారు.

టిప్పర్ పట్టివేత - కేసు నమోదు

నిమ్మనపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అగ్రహారం బాహుదా కాలువ నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. టిప్పర్ యజమాని అశోక్, డ్రైవర్ శంకర్‌పై కేసు నమోదు చేసి టిప్పర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే

కలికిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బొల్లినేని రాజగోపాల్ నాయుడును పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం బీఆర్ నాయుడు మంగళవారం సాయంకాలం తిరుమల చేరుకున్నారు. తిరుమలలోని శ్రీగాయత్రి నిలయం అతిథి గృహంలో కిశోర్‌కుమార్ రెడ్డి చైర్మన్‌ను కలిసి అభినందించారు. బీఆర్ ఆధ్వర్యంలో టీటీడీ పూర్వ వైభవం, భక్తుల మనోభావాలను చూరగొనడంలో సఫలీకృతులు కావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

'మెరుగైన వైద్యం అందించాలి'

వాల్మీకిపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామీణులకు వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని మదనపల్లె డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రమేష్‌బాబు ఆదేశించారు. మంగళవారం ఆయన చింతపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఆస్పత్రి రికార్డులు పరిశీలించి సిబ్బంది సేవల తీరుపై నేరుగా రోగులను అడిగి తెలుసుకున్నారు. నిత్యం వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. పీహెచ్‌సీలో కాన్పులు ప్రతి నెలా ఐదుకు తగ్గకుండా చేయాలని ఆదేశించారు. ఆశా డే సమావేశంలో పాల్గొని ఆశా కార్యకర్తల పనితీరుపై సమీక్షించారు. ఆశా కార్యకర్త వారి పరిధిలోని అర్హులైన దంపతులను సందర్శించి కాన్పు కోసం పీహెచ్‌సీకు ప్రోత్సహించాలని సూచించారు. వాతావరణంలో మార్పులతో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున గ్రామాల్లో అప్రమత్తంగా ఉంటూ వైద్య శిబిరాలు నిర్వహించి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక ప్రణాళికలు చేసుకుని సుఖప్రసవం జరిగేలా ప్రయత్నించాలన్నారు.

అతిగా మద్యం తాగి కోమాలోకి యువకుడు

కురబలకోట, నవంబరు 5: అతిగా మద్యం తాగిన యువకుడు ద్వారకనాథరెడ్డి కోమాలోకి వెళ్లాడని పోలీసులు తెలిపారు. ఎర్రమద్దివారిపల్లెకు చెందిన రైతు వెంకటరమణారెడ్డి కుమారుడు ద్వారకనాథరెడ్డి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామ సమీప కొండకు వెళ్లి అతిగా మద్యం తాగడంతో యువకుడు స్పృహ కోల్పోయి అక్కడే నిద్రపోవడంతో అతని శరీరమంతా చీమలు కరవడంతో ఇబ్బంది పడ్డాడు. ఇతడిని వెతుక్కుంటూ వెళ్లిన కుటుంబసభ్యులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. ముదివేడు పోలీసులు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేశారన్నారు.

'ఆదాయం పెంచడానికి కృషి చేయాలి'

మదనపల్లె అర్బన్, నవంబరు 5:(ఆంధ్రజ్యోతి) ఆర్టీసీ డిపోల ఆదాయం పెంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులతో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ అక్టోబరులో ఈపీకే 38.66, ఓఆర్ 72 శాతం, కేఎంపీఎల్ 5.37 సాధించి రీజియన్‌లోనే మదనపల్లె వన్ డిపో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. నవంబరులో ఈపీకే 45, ఓఆర్ 75 శాతం, కేఎంపీఎల్ 5.50 సాధించడానికి కృషి చేయాలని కోరారు. శబరిమలై యాత్రకు, అరుణాచలం గిరిప్రదక్షిణకు, కార్తీకమాసం స్పెషల్స్‌కు అందరూ టిక్కెట్లు బుక్కు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఎంఎఫ్ రవి, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క స్వైరవిహారం - ఆవు, ఇద్దరికి గాయాలు

పెద్దతిప్పసముద్రం నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): సంపతికోట గ్రామంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేయడంతో పాడి ఆవు, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సంపతికోటలో సోమవారం ఓ పిచ్చికుక్క కె. శంకరమ్మ, సూర్యానారాయణపై దాడి చేసి గాయపర్చింది. అనంతరం ఓ పాడి ఆవుపై దాడి చేయడంతో ఆవు తీవ్రంగా గాయపడింది. దీంతో సంపతికోటలో కొంతసేపు అలజడి నెలకొంది. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. గాయపడిన పాడి ఆవుకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. కాగా పాడి ఆవు తీవ్రంగా గాయపడడంతో ఆవు యాజమాని ఆవుకు ఏమవుతుందోనని ఆందోళన చెందుతున్నాడు. పంచాయతీ అధికారులు స్పందించి గ్రామాల్లో ఉన్న వీధి కుక్కలపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్ అంధకారమే : సీఐ


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రమేష్

కురబలకోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌కు పాల్పడితే విద్యార్థుల భవిష్యత్ అంధకారమవుతుందని సీఐ రమేష్ అన్నారు. మంగళవారం మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ సీనియర్లు, జూనియర్లు సోదరభావంతో మెలగాలన్నారు. చాలా మంది ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకున్నారన్నారు. విద్యార్థులు స్నేహపూర్వక వాతావరణంలో మెలగాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రామనాథమ్, డీన్ తులసీరామ్ నాయుడు, కో ఆర్డినేటర్ చంద్రమోహన్, సుబ్బారావు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె అభివృద్ధికి సహకరించండి

- మంత్రులను కలిసిన మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్

మదనపల్లె, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్ మంత్రులు అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్‌ను కోరారు. అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, మంత్రి సత్యకుమార్‌ను బెంగళూరు విమానాశ్రయంలో మాజీ ఎమ్మెల్యే కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. నియోజకవర్గ సమస్యలు మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు.

'రబీ టమోటాకు క్రాప్ ఇన్సూరెన్స్'

కురబలకోట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసే టమోటా పంటకు వాతావరణ ఆధారిత క్రాప్ ఇన్సూరెన్స్ సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తున్నట్లు జిల్లా ఉద్యానవన అధికారి రవిచంద్ర పేర్కొన్నారు. మంగళవారం అంగళ్ళు మదనపల్లె డివిజన్ పరిధి ఉద్యాన, వ్యవసాయ శాఖ సహాయకులకు టమోటా పంట బీమా పంటపై అవగాహన, శిక్షణా తరగతులను నిర్వహించారు. అక్టోబరు 15 నుంచి డిసెంబరు 15వరకు టమోటాను సాగు చేసే రైతుల కోసం ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు.

రైతుబజార్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- ప్రారంభించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్


రైతుబజార్ శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

మదనపల్లె టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మదనపల్లె రైతుబజార్‌ను ఆదర్శంగా వుండేలా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పిలుపునిచ్చారు. మంగళవారం ఆధునీకరించిన రైతు బజార్‌ను జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌తో కలసి ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. 14ఏళ్లగా మూతపడిన రైతుబజార్‌ను ప్రారం భించేందుకు, వీరు రూ.లక్ష సొంత డబ్బుతో ఆధునీకరించారన్నారు. జేసీ ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ రైతుబజార్‌లో 32 స్టాళ్లను ఏర్పాటు చేశామని, వీటిని రైతులకు ఉచితంగా కేటాయిస్తామన్నారు. నిర్వహణకు అయ్యే ఖర్చుల కోసం 8 స్టాళ్లను వ్యాపారులకు కేటాయి స్తున్నామన్నారు. రైతుల ఉత్పత్తులు విక్రయించుకునేలా, వారపుసంతకు రెండు వైపులా షెడ్‌లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. వ్యవసాయ మార్కెటింగ్ ఏడీఎం త్యాగరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో తిరిగి రైతుబజార్‌ను సద్వినియోగం చేసుకునేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. డీఏఓ చంద్రానాయక్, ఉద్యాన అధికారి రవిచంద్ర, ఆర్డీఓ రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, టీడీపీ నేతలు మస్తాన్, విద్యాసాగర్, నాగయ్య పాల్గొన్నారు.

లో ఓల్టేజీపై జాగ్రత్త అవసరం

కలికిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గంలో రైతులకు లో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి సూచించారు. సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. గుట్టపాలెం పంచాయతీ సి.బరినేపల్లె వద్ద రూ. 2.15 కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. కొత్త కనెక్షన్ల మంజూరులో రైతులకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సూచించారు. రాయచోటి ఎస్ఈ ఆర్.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కొత్త సబ్‌స్టేషన్ నుంచి వాల్మీకిపురం మండలంలోని కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు వివరించారు. పీలేరు ఈఈ వై.చంద్రశేఖర్ రెడ్డి, కలికిరి డీఈఈ ఎం.శివయ్య, ఏఈ ముజిబూర్ రహ్మాన్, రాయచోటి కన్‌స్ట్రక్షన్ ఈఈ కె.శ్రీనివాసులు, డీఈఈ కె.రెడ్డికుమార్, రాయచోటి ఏఈ బి.వసంతకుమార్, ఎంపీడీఓ భానుమూర్తి రావు, ఇన్‌చార్జ్ తహసీల్దారు నవీన్, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.